APTEL/26/A2363

ANDHRA JANANAADU TELUGU DAILY

ఆంధ్ర జనానాడు

తెలుగు దినపత్రిక

ఆంధ్ర జనానాడు

ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా, మండలాల వారిగా విలేఖర్లుగా పని చేయడానికి అనుభవం కలిగిన లేక కొత్తగా ఆసక్తి కలిగిన వారు

సంప్రదించండి

89195 17176

ఎడిటర్ : ఎం. ఎ. నవీన్ కుమార్ సంపుటి : 01 సంచిక : 142 పేజీలు : 08, వెల : 1/- మంగళవారం 02 - 06 - 2026

Published From : Anantapuram, East Godavari, Kurnool, VishakaPatanam,Guntur, Prakasam, Nellore, Kadapa,Chittor

పన్నుల ఎగవేతదారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం

- డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!
- గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి
- పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న
- పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ - మిగతా 2 లో

దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే

అభివృద్ధి, సంక్షేమం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారాలే పనిగా పెట్టుకున్నారని మండిపాటు
- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ
- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి
- ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీచేస్తే ఓర్వలేకపోయిందన్న సీఎం

అమరావతి :

'గతంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే వెంటనే రద్దు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు నెలల వరకు ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో కుటుంబానికి దాదాపు 3, 4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.మహిళలకు 33% సీట్లు, ఉచితంగా 3 సిలిండర్లు: ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించి రాజకీయంగా ఎదిగేలా చేసేలా కృషి - మిగతా 2 లో

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో

ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

- ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో నారా లోకేష్ భేటీ
- ఏపీలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు
- ఎయిర్‌ట్రంక్ సీఈఓతో సమావేశమై వైజాగ్‌కు ఆహ్వానం
- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన ఎయిర్‌ట్రంక్
- ఏపీకి ఐటీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యటన

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు.ముంబైలోని వర్షా బంగ్లాలో ముఖ్యమంత్రి - మిగతా 2 లో

దేశంలో జల వనరుల నిర్వహణ కోసం

ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్
- దేశంలో కొత్త జల పరిశోధన కార్యక్రమాలకు నాంది
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర జలశక్తి శాఖ
- అగ్రిమెంట్‌పై సంతకాలు చేసిన ఇరువర్గాలు
- జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి

ఢిల్లీ :

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలో నీటి వనరుల నిర్వహణ కోసం శాటిలైట్ టెక్నాలజీ, అంతరిక్ష ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేసేందుకు ఈ అగ్రిమెంట్ చేసుకుంది. దిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సందర్భంగా ఈ అవగాహన ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి.డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగిన వర్క్‌షాప్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి నీటి భద్రత చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. నీటికి సంబంధించిన సవాళ్లను సాంకేతికత, ఆవిష్కరణలు, సంప్రదాయ జ్ఞానం, ప్రజా భాగస్వామ్యం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. గత దశాబ్దంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అనేక పరిశోధనా అధ్యయనాలకు మద్దతు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇందులో 113 ప్రత్యక్ష ప్రాయోజిత ప్రాజెక్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఇవి జల రంగంలో ఆచరణాత్మక - మిగతా 2 లో

ఇరాన్ రాడార్లు.. డ్రోన్ వ్యవస్థపై

అమెరికా భీకరదాడులు

- కువైట్ గగనతలంలోకి వచ్చిన క్షిపణులను అడ్డుకున్న ఎయిర్ డిఫెన్స్
- ఇరు దేశాల దాడులతో 2 శాతం పెరిగిన చమురు ధరలు
- భూగర్భ క్షిపణి టన్నెళ్లను వేగంగా పునరుద్ధరిస్తున్న ఇరాన్

ఢిల్లీ :

మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ పొడిగింపు కోసం దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేడెక్కాయి. అమెరికా, ఇరాన్ బలగాలు గత వారాంతంలో డ్రోన్లు, క్షిపణులతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరాన్ దూకుడుకు ప్రతిగా 'ఆత్మరక్షణ దాడులు' జరిపామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించగా, ఇది తమపై జరిగిన దాడికి ప్రతీకార చర్యేనని ఇరాన్ స్పష్టం చేసింది.అంతర్జాతీయ జలాల్లో నిఘా పెట్టిన తమ ఎమ్‌క్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపించింది. దీనికి ప్రతిగా, అమెరికా ఫైటర్ జెట్లు దక్షిణ ఇరాన్‌లోని గోరుక్ ప్రాంతం, క్విష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ వ్యవస్థలు, డ్రోన్ కంట్రోల్ కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించినట్లు సెంట్‌కామ్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో ఇరాన్‌కు - మిగతా 2 లో



చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు

- కాకినాడ జిల్లాలో కల్లుగీత కార్మికుడి ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబు
- పోలరపు సింహాచలం అనే కార్మికుడికి స్వయంగా పింఛను అందజేత
- కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు ఆదేశం
- గీత కార్మికుల కష్టాలు తెలుసుకుని తాటికల్లు రుచిచూసిన సీఎం

యూపీఐ సంచలనం.. దశాబ్ద కాలంలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు

- రూ.30 లక్షల కోట్లకు చేరువైన లావాదేవీల మొత్తం విలువ
- గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెరిగిన లావాదేవీల సంఖ్య
- 8కి పైగా దేశాల్లో అందుబాటులోకి వచ్చిన యూపీఐ సేవలు

పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్

- అనుమతి నిరాకరించిన పోలీసులు
- హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ
- జూన్ 2న ఆవిర్భావ వేడుకల దృష్ట్యా భద్రతా కారణాలు చూపిన పోలీసులు
- 'జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో సభకు ప్రణాళిక
- ఈ సభపై తెలంగాణలో కొనసాగుతున్న రాజకీయ చర్చ

హైదరాబాద్ :

హైదరాబాద్‌లో జనసేన పార్టీ రేపు నిర్వహించ తలపెట్టిన నవనిర్మాణ సభకు సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో 'జనసేన సాధక్' (యాక్టివ్ సభ్యులు) సమావేశం నిర్వహించాలనుకున్నారు. సుమారు 2,000 మంది పార్టీ కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేసిన ఈ సమావేశానికి అనుమతిని తిరస్కరిస్తున్నట్లు సెరిలింగంపల్లి జోన్ డీసీపీ కార్యాలయం సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.శాంతిభద్రతల సమస్యలు, స్థానిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. - మిగతా 2 లో

నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

- ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తామన్న టీజీపీఎస్సీ ఛైర్మన్
- 3,800 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతిచ్చిందని వెల్లడి
- కంప్యూటర్ బేస్డ్ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని అభ్యర్థులకు సూచన

హైదరాబాద్ :

నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ప్రకటన - మిగతా 2 లో

కొత్త నాయకత్వం కోసం

కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

- యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!
- సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కొత్త కార్యక్రమం
- రాజకీయ నేపథ్యం లేని యువతకు సువర్ణావకాశమన్న మహేశ్ గౌడ్
- టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తామన్న పీసీసీ చీఫ్

హైదరాబాద్ :

రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ - మిగతా 2 లో

సంపాదకీయం

కాలాతీత బాల్యం

'టామ్.' జవాబు లేదు. 'ఒరేయ్ టామ్.' పోలీ పెద్దమ్మ పిలుపునకు ఇప్పుడు ప్రపంచం నలుమూలలా ఓ అని వినబడుతుంది. టామ్ అమెరికాలో మాత్రమే లేడుగా! వాడు ఆఫ్రికాలోనూ ఉన్నాడు, అనకాపల్లిలోనూ ఉంటాడు. అల్లరి, సాహసం కలగలిసిన ప్రతి పిల్లాడూ టామే! 1876 జూన్ 9న 'పుట్టిన' టామ్ సాయర్‌కు ఇప్పుడు 150 ఏళ్లు! కానీ ఆ తుంటరికి వయసనేది అయిపోతుందా? టామ్ సదాబాలుడు, సరదా బాలుడు; పోలీ పెద్దమ్మనే కాదు, సకల ప్రపంచాన్ని తన అల్లరి చేష్టలతో ఏలిన కౌబాలుడు. 'ది అడ్వెంచర్స్ ఆఫ్ టామ్ సాయర్' నవలను మార్క్ ట్వెయిన్ కేవలం పిల్లల కోసమే రాయలేదు. 'పెద్దవాళ్లు తమ చిన్నతనంలో తాము ఎలా ఉండేవారో, తమ ఆలోచనలు ఎలా ఉండేవో, తాము ఎలా మాట్లాడేవారో, చిత్రమైన సన్నివేశాల్లో ఎలా చిక్కుకునేవారో ఆహ్లాదకరంగా వారికి జ్ఞాపకం' చేసిందా నవల. ప్రపంచ సాహిత్య యవనికపై ఒక చిలిపి బాలుడి సాహసాలు ఇంతటి సుదీర్ఘ కాలం సజీవంగా ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఇంటి గోడకు సున్నం వేయడాన్ని కూడా ఒక కళగా మార్చి, ఇతరులతో పని చేయించుకునే తెలివితేటలున్న టామ్ నేటి మేనేజ్‌మెంట్ గురువులకు ఆది గురువు. ఈ నవల రాకముందు, అమెరికన్ సాహిత్యం ఎక్కువగా యూరోపియన్ శైలిని అనుకరిస్తూ, నీతి సూత్రాలతో నిండి ఉండేది. కానీ ట్వెయిన్ అమెరికన్ మాండలికాన్ని, సామాన్యుల భాషను సాహిత్య గౌరవ పీఠంపై కూర్చో బెట్టాడు. 'ఆధునిక అమెరికన్ సాహిత్యం అంతా మార్క్ ట్వెయిన్ రాసిన ఒకే ఒక్క పుస్తకం నుండి పుట్టింది' అని 'ది అడ్వెంచర్స్ ఆఫ్ హకల్‌బెరీ ఫిన్' (1884) నవలను కొనియాడాడు ఎర్నెస్ట్ హెమింగ్వే. ఈ నవల టామ్ సాయర్‌కు పొడిగింపు అన్నది గుర్తుంచుకుంటే దాని బీజాలు మొదటే ఉన్నాయన్నది అర్థమవుతుంది.కొన్ని కథలు రాసినా ట్వెయిన్‌కు ఇది తొలి నవల. మిసిసిపీ నది తీరాన ఉన్న హానిబాల్ గ్రామంలో గడిపిన తన సొంత బాల్య స్మృతుల నుంచే ట్వెయిన్ ఈ కథను అల్లుకున్నాడు. తనకు తెలిసిన ముగ్గురు అల్లరి పిల్లల లక్షణాలను కలిపి 'టామ్'ను సృష్టించాడంటారు. పేరును మాత్రం లోకల్ హీరో అయిన ఒక ఫైర్‌ఫైటర్ మీదుగా స్వీకరించాడు. ట్వెయిన్‌కు అతడు స్నేహితుడు కూడా. ఇద్దరూ కలిసి సాయంత్రాలు షికార్లు కొట్టేవాళు . అందరికీ ఇష్టమైన హకల్‌బెరీ ఫిన్ పాత్రనేమో తన బాల్యమిత్రుడు టామ్ బ్లాంకెరీ షిప్ ఆధారంగా రూపొందించాడు. ట్వెయిన్ చుట్టూ ఎందరు టాములో! సిడ్ సాయర్, బెకీ థాచర్, జడ్జ్ థాచర్, జో హార్పర్, విడో డగ్లస్, ఇంజన్ జో లాంటి పాత్రలు కూడా మరిచిపోలేనివి. సినిమాలుగా, టీవీ ప్రోగ్రాములుగా, మ్యూజి కల్సుగా అలరించిన టామ్ సాయర్, టైప్‌రైటర్ మీద రాసిన తొలి నవల అని ప్రచారంలో ఉంది. కానీ అది నిజానికి 'లైఫ్ ఆన్ ద మిసిసిపీ' (1883) అని మరోమాట! ఇదీ మార్క్ ట్వెయిన్‌దే కావడం గమనార్హం.పిల్లలు కేవలం మంచివాళ్లు లేదా చెడ్డవాళ్లు కాదు; వాళ్లు అల్లరి, భయం,సాహసం కలగలిసిన వాళ్లని ప్రపంచానికి చాటి చెప్పాడు ట్వెయిన్. ప్రకృతితో మమేకమవ్వడం, అన్వేషించడం నేటి పిల్లలు కోల్పోతున్న సహజ లక్షణాలు. చీకటి గుహల్లో నిధుల కోసం వెతికిన టామ్ మనకు ఇదే గుర్తు చేస్తాడు. నేటి డిజిటల్ యుగంలో, స్మార్ట్‌ఫోన్లకు బందీలైపోతున్న బాల్యానికి టామ్ సాయర్ ఒక తాళంచెవి. వందల ఏళ్లు గడిచినా, సమాజం ఎంత ఆధునీకరించబడినా మనుషుల్లోని అమాయ కత్వం, సాహస ప్రవృత్తి మారవు. అందుకే 'టామ్ సాయర్' కేవలం ఒక పుస్తకం కాదు, అది ప్రతి ఒక్కరి లోపల దాగి ఉన్న బాల్యానికి నిలువుటద్దం. ఈ 150వ వేడుకల సందర్భంగా మనలోని ఆ చిలిపి టామ్ సాయర్‌ను ఒకసారి నిద్రలేపుదాం! ఈ నవలను నండూరి రామమోహనరావు (1927-–2011) టామ్ మన పక్కింటి పిల్లాడే అన్నంత హాయిగా తెలుగులోకి అనువదించాడు. రచయిత నామిని తన కొడుక్కు టామ్ సాయర్ అని పేరు పెట్టుకున్నాడు. టామ్ ఎంతటి తెలుగువాడో చెప్పడానికి ఇంతకంటే రుజువు అక్కర్లేదు. ఈ తిరుపతి టామ్ రచయితగా మారడం ఆ టామ్‌ను కన్నమార్క్ ట్వెయిన్‌కు తగిన నివాళి.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

మొదటిపేజీ తరువాయి - దేవేంద్ర ఫడ్నవీస్‌తో లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. లోకేష్ ఆయనకు తిరుమల శ్రీవారి ప్రతిమ, మంగళగిరి శాలువా బహూకరించగా, ఫడ్నవీస్ గణేశుడి విగ్రహాన్ని అందజేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక అంశాలు, ఏపీలో పెట్టుబడులు, వ్యాపార అనుకూల విధానాలు, విద్యా సంస్కరణలపై వారు చర్చించుకున్నారు.లోకేష్ తన ముంబై పర్యటనలో, ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో లోకేష్ సమావేశమై విశాఖపట్నం ప్రాధాన్యతను వివరించారు. వైజాగ్‌ను ఐటీ, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. విశాఖలో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ఎయిర్‌ట్రంక్‌ను లోకేష్ ప్రత్యేకంగా కోరారు.లోకేష్ ప్రజెంటేషన్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎయిర్‌ట్రంక్ సీఈఓ సానుకూలంగా స్పందించారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు అవకాశాలను తీవ్రంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఐటీ రంగంలోకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా లోకేష్ ఈ పర్యటనలు చేపడుతున్నారు.

పన్నుల ఎగవేతదారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి - పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశి ంచారు.పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ రంగాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరులు తమ పన్నులను క్రమబద్ధంగా చెల్లిస్తున్నప్పుడు.. పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తమ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. "సాధారణ ప్రజలు ఎంతో నిజాయతీగా పన్నులు కడుతున్నారు. మరి పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలు పంచాయతీలకు చెల్లింపులు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? ఎందుకు ఎగవేస్తున్నాయి?" అని పవన్ నిలదీశారు.పన్నుల రికవరీ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉపముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదరు సంస్థల నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని పన్నులను పూర్తిగా రికవరీ చేయడానికి కఠినమైన విధానాన్ని అవలంబించాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించని డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలపై తక్షణమే అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ఇరాన్ రాడార్లు.. డ్రోన్ వ్యవస్థపై అమెరికా భీకరదాడులు

మొదటిపేజీ తరువాయి - చెందిన రెండు సూసైడ్ డ్రోన్లను కూడా ధ్వంసం చేశామని, తమ సైనికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించింది.అమెరికా దాడులకు ప్రతీకారంగా, సరిక్ ద్వీపంపై దాడిలో పాల్గొన్న ఒక అమెరికా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణులతో దాడి చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు, తమ గగనతలంలోకి ప్రవేశించిన కొన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా నాశనం చేసినట్లు కువైట్ సైన్యం ప్రకటించింది.ఈ దాడుల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 2 శాతం పెరిగి 93.05 డాలర్లకు చేరింది. ఇదిలావుండగా, గత దాడుల్లో ధ్వంసమైన భూగర్భ క్షిపణి టన్నెళ్లను ఇరాన్ వేగంగా పునరుద్ధరిస్తోందని 'సీఎన్‌ఎన్' తన కథనంలో వెల్లడించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా, దెబ్బతిన్న 69 టన్నెల్ ప్రవేశ మార్గాల్లో ఇప్పటికే 50 మార్గాలను ఇరాన్ తిరిగి వినియోగంలోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ పరిణామాలు గల్ఫ్ రీజియన్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి.

కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

మొదటిపేజీ తరువాయి - ద్వారా ఎంపిక చేస్తారు.సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే అభివృద్ధి, సంక్షేమం

మొదటిపేజీ తరువాయి - చేస్తున్నామన్నారు. రాష్ట్ర రైతుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు పెరిగినా మహిళలకు ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తున్నామని సీఎం అన్నారు. నేరుగా పేదవాడి ఇంటికి వచ్చి పింఛను ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. కేవలం ఈరోజు బాగుంటే చాలదు, భవిష్యత్ కూడా బాగుండేలా ప్రణాళికలు వేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, విశాఖలో గూగుల్ రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని చంద్రబాబు పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే మన వాళ్లు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని. విశాఖలో గూగుల్ సంస్థ రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. రాష్ట్ర యువత నైపుణ్యాలు పెంచుకొని ఉద్యోగాలు అందుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యత మాదని ఆయన భరోసా ఇచ్చారు. గతేడాది యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈసారి అమరావతి కేంద్రంగా యోగా కార్యక్రమాలు చేపడతామని, రోజుకు అరగంట వ్యాయామం చేస్తే అనారోగ్యాలు దరిచేరవన్నారు. అందరి జీవన ప్రమాణాలు

పెరగాలన్నదే మా కల అని సీఎం వివరించారు.'పింఛన్లు ఇంటింటికే వచ్చి అందిస్తున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఏ సమస్యకైనా ఆన్‌లైన్‌లోనే పరిష్కారం చూపుతున్నాం. పీ4 కార్యక్రమం కింద పేదలను ఆదుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్, నేను కలిసి పని చేస్తున్నాం. డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తే వైఎస్సార్సీపీ ఓర్వలేకపోతోంది. రాష్ట్రాభివృద్ధి చూసి ఆ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. మత విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది. వైకాపా అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'.రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యం: తిరుమల వెంకటేశ్వరస్వామి జోలికొస్తే ఆయనే చూసుకుంటారని, హిందూ దేవాలయాలపై దాడులు చేయడం మంచి పని కాదు సీఎం హెచ్చరించారు. ఆలయాలను అపవిత్రం చేయాలని చూస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహంపై దాడి చేసి మాపై నెట్టాలని చూశారని మండిపడ్డారు. ఆరా తీస్తే వైఎస్సార్సీపీ వాళ్లే చేసినట్లు రుజువైందన్నారు. విగ్రహం ధ్వంసం చేశారని అబద్ధాలు చెప్పి సానుభూతి కోసం ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.దళితుణ్ని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఊరేగిస్తారా? అని సీఎం సూటిగా ప్రశ్నించారు. సీబీఎన్ పాలనలో అరాచక శక్తులకు చోటు లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యమని సీఎం హితవు పలికారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే మా ధ్యేయమని 2027 పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. కొత్తపల్లి మండలంలో ఫిషింగ్ హార్బర్ తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు.

దేశంలో జల వనరుల నిర్వహణ కోసం ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

మొదటిపేజీ తరువాయి - పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో సహాయపడ్డాయని తెలిపారు.ఈ వర్క్‌షాప్‌లో జల్ సంచయ్ జన భాగీదారీ ప్రచార కార్యక్రమం మూడో దశను సీఆర్ పాటిల్ ప్రారంభించారు. 2026 జూన్–2027 మే మధ్య రెండు కోట్ల నీటి సంరక్షణ నిర్మాణాలను సృష్టించాలనే లక్ష్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. గత దశలో 1.5 కోట్ల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్త చొరవతో మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్ - వాటర్ ప్రోగ్రామ్‌ను కూడా సీఆర్ పాటిల్ ప్రారంభించారు. అలాగే భారత్ వాటర్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ వేదిక కింద స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు కోసం ఓపెన్ కాల్‌ను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ ఒప్పందం రెండు సంస్థల మధ్య సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని, నీటి నిర్వహణ కోసం ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేస్తుందని ఇస్రో ఛైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి వి. నారాయణన్ అభిప్రాయపడ్డారు. జలవనరులను పరిశీలించడానికి, ముందస్తుగా అంచనా వేయడానికి, నిర్వహించడానికి నేటి అంతరిక్ష సాంకేతికత అపూర్వమైన సామర్థ్యాన్ని అందిస్తోందని తెలిపారు. భూగర్భ జలాల అంచనా, జలవనరుల పర్యవేక్షణ, వరదల ముందస్తు అంచనా వంటి రంగాలలో పనులకు ఈ భాగస్వామ్యం మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇస్రో, జలవనరుల రంగం మధ్య సహకారం 1982 నాటిదని గుర్తు చేసుకున్నారు. మరోవైపు, మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్– వాటర్ కార్యక్రమం విద్యాసంస్థలు, ప్రయోగశాలలు, స్టార్టప్‌లు, పారిశ్రామిక భాగస్వాములతో కూడిన బహుళ సంస్థాగత ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుందని ఏఎన్ఆర్ఎఫ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివకుమార్ కళ్యాణ రామన్ అన్నారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సోమవారం (జూన్ 1న) జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో సుస్థిర భూగర్భ జలాల నిర్వహణ, సాంకేతిక ఆవిష్కరణలు, వర్షపు నీటి సేకరణపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, నిపుణులు పాల్గొని పలు విషయాలు చర్చించారు. దేశంలో నీటి ఆవిష్కరణల భవిష్యత్తుపై చర్చించడానికి నిపుణులు, పరిశోధకులకు ఈ వర్క్‌షాప్ ఒక వేదికగా మారింది.

యూపీఐ సంచలనం.. దశాబ్ద కాలంలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు

మొదటిపేజీ తరువాయి - భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ తన వృద్ధిని బలంగా కొనసాగిస్తోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే లావాదేవీలు మే నెలలో మరోసారి సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఈ నెలలో లావాదేవీల సంఖ్య (వాల్యూమ్) 23.20 బిలియన్లకు చేరగా, వాటి విలువ దాదాపు రూ.30 లక్షల కోట్ల మార్కును తాకింది. ఈ వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సోమవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి.ఎన్‌పీసీఐ డేటా ప్రకారం.. మే నెలలో యూపీఐ ద్వారా మొత్తం రూ.29.90 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 24 శాతం పెరగ్గా, వాటి విలువ 19 శాతం వృద్ధి చెందింది. మే నెలలో సగటున రోజుకు సుమారు 748 మిలియన్ల లావాదేవీలు జరిగాయని, వాటి సగటు విలువ రోజుకు సుమారు రూ.96,465 కోట్లుగా ఉందని

గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ నెలతో పోల్చినా లావాదేవీల సంఖ్యలో 3.8 శాతం, విలువలో 3 శాతం పెరుగుదల కనిపించింది.గత ఏప్రిల్ నెలలో కూడా డిజిటల్ చెల్లింపులు 25 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తూ 22.35 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి. వాటి విలువ రూ.29.03 లక్షల కోట్లుగా ఉంది. యూపీఐతో పాటు, ఇతర డిజిటల్ చెల్లింపులైన ఇమ్మీడియట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) ద్వారా మే నెలలో 358 మిలియన్ల లావాదేవీలు, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా 88 మిలియన్ల లావాదేవీలు జరిగాయి.కేవలం దేశంలోనే కాకుండా, యూపీఐ సేవలు అంతర్జాతీయంగా కూడా విస్తరిస్తు న్నాయి. యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్, ఖతార్‌తో సహా 8కి పైగా దేశాల్లో ప్రస్తుతం యూపీఐ అందుబాటులో ఉంది. దీంతో డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహిస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గత దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో ఏకంగా 12,000 రెట్ల అసాధారణ వృద్ధి నమోదైంది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్లుగా ఉన్న లావాదేవీలు, 2025–26 ఆర్థిక సంవత్సరానికి 24,162 కోట్లకు పైగా పెరగడం విశేషం.

చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి - ముఖ్యమంత్రి చంద్రబాబు 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతున్నారు. సోమవారం కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో పర్యటించిన ఆయన, కల్లుగీత కార్మికుడు పోలరపు సింహాచలం ఇంటికి స్వయంగా వెళ్లారు. ఆయనకు రావాల్సిన పింఛనును చేతికి అందించి ఆశ్చర్యపరిచారు.ఈ సందర్భంగా సింహాచలం కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం, వారి జీవన విధానం గురించి ఆరా తీశారు. అత్యంత శ్రమతో కూడిన కల్లుగీత వృత్తిలోని కష్టనష్టాలు, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో, తమకు సొంత ఇల్లు లేదని సింహాచలం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. ఆ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు.అనంతరం, తాటి చెట్టు నుంచి కల్లు తీసే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. గీత కార్మికులు అప్పుడే తీసిన తాజా తాటి కల్లును రుచి చూశారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పేద ప్రజల సంక్షేమమే తన ప్రభుత్వ లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్

మొదటిపేజీ తరువాయి - ఇటీవల ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం, ఆ తర్వాత ఏపీకి చెందిన జనసేన సహా కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని పోలీసులు తెలిపారు. ఈ పరిణామాల వల్ల తెలంగాణలోని విద్యార్థి సంఘాలు, ఇతర బృందాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని వివరించారు.అంతేకాకుండా, జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఈ సమయంలో సమావేశం నిర్వహించడం సమంజసం కాదని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని, నిరసనలు, ఆందోళనలు జరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.వీటితో పాటు, సమావేశం జరగాల్సిన సంధ్యా కన్వెన్షన్‌కు తగినంత పార్కింగ్ సౌకర్యం లేదని విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. నిర్వాహకులు పార్కింగ్ కోసం ప్రతిపాదించిన ఎఫ్‌సీఐ సొసైటీ లేఅవుట్‌కు సంబంధించిన స్థలంపై న్యాయపరమైన వివాదాలు ఉన్నాయని, ఆ స్థలంపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తమ ఉత్తర్వుల్లో వివరించారు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రజా శాంతికి భంగం కలగకూడదనే ఉద్దేశంతో సమావేశానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ తాళ్లూరి రామ్ ఈ సమావేశం కోసం మే 29న పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు.

నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ - నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

మొదటిపేజీ తరువాయి - చేసింది. నోటిఫికేషన్‌ల విడుదలతోపాటు పరీక్ష విధానంలో తీసుకురానున్న మార్పులపై టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కీలక వివరాలను వెల్లడించారు. మంగళవారం ఒకేసారి 3 కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తామని చెప్పారు. కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఊపందుకోనుంది. టీజీపీఎస్సీ ద్వారా అనేక ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. నెలలో 2 నుంచి 3 నోటిఫికేషన్‌లు విడుదల చేస్తామన్నారు. నేడు ఒకేసారి 3 కొత్త ఉద్యోగ ప్రకటనలిస్తామన్నారు. ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 3800 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. టీజీపీఎస్సీలో ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉందని, మరో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలున్నాయని వివరించారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదలచేసే యోచనలో ఉన్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు.పరీక్షల నిర్వహణలో లీకేజీలకు తావులేకుండా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ వివరించారు. భవిష్యత్‌తో పరీక్షలను రావీ= విధానంలో కాకుండా, కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఆ విధానంలో పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులకి మార్కులు తెలిసే అవకాశం ఉంటుందన్నారు. యూపీఎస్సీకి చెందిన ప్రతిభాసేతు తరహాలో రాష్ట్రంలో ప్రతిభా భారతి కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కొలువులివ్వడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం తెలిపారు. తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదన్నారు." నేడు మూడు నోటిఫికేషన్లు వస్తాయి. మరో వారంలోనే మరికొన్ని ఉద్యోగ భర్తీకి ప్రకటన లొస్తాయి. ఈనెలలోనే సుమారుగా 5 నుంచి 6 నోటిఫికేషన్‌లు ఇస్తాం. తక్కువ పోస్టులున్న వాటిని ఎలా భర్తీ చేయాలో ఆలోచన చేస్తున్నాం. ప్రతి రెండు మూడు నెలలకు ఫలితాలను ప్రకటిస్తాం. మూడు నుంచి గరిష్టంగా 6 నెలల కాలంలో ఉద్యోగాల్లో చేరాలా చర్యలు తీసుకుంటాం. టీజీపీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదు. టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేయడం మంచిదికాదు"

పాత్రికేయుడిపై దాడి కేసులో
శ్రీ గీతం కళాశాల ప్రిన్సిపాల్ మనీషా నాయర్ అరెస్ట్

బెయిలబుల్ సెక్షన్లపై కోర్టు వ్యాఖ్యలు
పోలీసుల తీరుపై చర్చ

అనంతపురం, జూన్ 1 (ఆంధ్ర జన నాడు) : మనం పత్రిక జర్నలిస్ట్ లక్ష్మీనారాయణపై జరిగిన దాడి కేసులో శ్రీ గీతం కళాశాల ప్రిన్సిపాల్ మనీషా నాయర్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటనకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాల ఆధారంగా దాదాపు నెలరోజుల పాటు విచారణ జరిపిన అనంతరం పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో రూరల్ పోలీసులు మనీషా నాయర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరిచారు. అయితే, కేసులో నమోదు చేసిన సెక్షన్లు బెయిలబుల్ కావడంతో స్టేషన్ బెయిల్ మంజూరు చేయకుండా నేరుగా కోర్టుకు తీసుకురావడంపై న్యాయస్థానం ప్రశ్నించినట్లు సమాచారం. బెయిలబుల్ సెక్షన్లకు స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ కోర్టులో హాజరుపరచడంపై న్యాయమూర్తి పోలీసులను వివరణ కోరినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, దాడిలో గాయపడిన జర్నలిస్ట్ లక్ష్మీనారాయణపైనా కేసు నమోదు చేయడాన్ని పలు ప్రజాసంఘాలు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ అంశంపై దశలవారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు వారు హెచ్చరించారు. ఈ కేసు నేపథ్యంలో పోలీసులు వ్యవహరించిన తీరు, నిందితురాలికి కల్పించిన భద్రతా ఏర్పాట్లు, కేసు దర్యాప్తు అంశాలపై జిల్లాలో చర్చ కొనసాగుతోంది.

కొట్టాలపల్లిలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ

కార్యక్రమంలో పాల్గొన్న అనంతపురం పార్లమెంట్ సభ్యులు
అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణి

అనంతపురం, ఆంధ్ర జననాడు జూన్ 01 : బుక్కరాయ సముద్రం మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ చేసే కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా వివిధ రకాల పెన్షన్ 4000 నుంచి 15000 రూపాయల వరకు భరోసా పథకం కింద పెన్షన్ పంపిణీ చేయడం మన ప్రభుత్వం పేదలకు ఇస్తున్నటువంటి గొప్ప భరోసా అని, ప్రతి నెల ఒకటో తారీఖున ఉదయమే పెన్షన్ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నదని, ఎంతోమంది తమ జీవనోపాధికి, జీవనానికి ఆసరాగా పెన్షన్ ఉపయోగపడుతున్నదని, ప్రజల సంక్షేమం కోసమే నిత్యం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలియజేశారు. గ్రామంలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ పంపిణీ కొరకు ఎంతో ఖర్చు పెడుతున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం కృషి చేస్తున్న ఈ మంచి ప్రభుత్వాన్ని ప్రజల ఆశీర్వదించాలని తెలిపారు. ఈ సందర్భంగా సింగనమల

ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలియజేశారు. పెన్షన్ కార్యక్రమం అనంతరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని ఎంపీ, ఎమ్మెల్యే సందర్శించి చిన్నపిల్లలకు అందుతున్నటువంటి పౌష్టిక ఆహారము గురించి, ప్రభుత్వ కార్యక్రమాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నారు అడిగి తెలుసుకుని, కొన్ని సూచనలు అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, మండల రెవెన్యూ అధికారులు, స్థానిక గ్రామ సెక్రెటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎంపీపీ దాసరి సునీత, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శైలజ, సొసైటీ చైర్మన్ కేసన్న, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జలధార - జలహారతి కార్యక్రమం కింద మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం, ఆంధ్రజననాడు, జూన్ 1 : జలధార - జలహారతి కార్యక్రమం కింద మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), ఎన్ఆర్ఈజిఏ, జలధార, పీఎం సూర్య ఘర్, అగ్రికల్చర్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్, తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎపిడిలు, ఎపిఓలు, సంబంధిత శాఖల మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలధార - జలహారతి కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా ఆయా మండల పరిధిలో మొత్తం 5200 దాకా పనులను గుర్తించడం జరిగిందని జులై 9లోగా సంరక్షణలో నీటి నిలువ పనులు మరియు చెరువులకు సంబంధించిన పనులు మంజూరు

కావడం జరిగిందని, ఇందులో మొదలుకాని పనులను వెంటనే ప్రారంభించాలని ఆయా మండల అభివృద్ధి అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వందరోజుల జలధార - జలహారతి పనులను పెండింగ్ లేకుండా వేగవంతంగా చేపట్టాలన్నారు. వాటర్ కన్జర్వేషన్ స్ట్రక్చర్స్ కు సంబంధించి తప్పనిసరిగా తనిఖీలు చేయాలని, కూలీల హాజరుకు సంబంధించి ప్రతిరోజు ఒక లక్ష 50 వేలమంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పురోగతిలో వెనుకబడిన బ్రహ్మసముద్రం ,డి హీరేహాళ్, కుందుర్పి, కనేకల్లు తదితర మండలాల అధికారుల జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ లేకుండా పనులను గ్రౌండింగ్ చేసి పురోగతి సాధించాలన్నారు. ఉద్యాన పంట సాగులో భాగంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపికను త్వరితగతినపూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి ఎల్.నినో వల్ల పిఎండిఎస్ పద్ధతిలో విత్తనాలు వేయించేలా చూడాలని, ఈ పద్ధతిలో విత్తనాలను నాటడం ద్వారా తక్కువ వర్షపాతంతో కూడా పంటలు పండుతాయని, వర్షాభావ పరిస్థితుల్లో పిఎండిఎస్ పై రైతులకు క్షేత్రస్థాయికి వెళ్లి వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అలాగే హార్టికల్చర్ పంటలైన కూరగాయలు, పండ్ల తోటలను డ్రిప్ విధానంతో సాగయ్యేలా ప్రోత్సహించాలని, పెరిగిన పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేయాలన్నారు. తాసిల్దార్ లు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సెన్సెస్ కార్యక్రమాన్ని జి.ఎస్.డబ్ల్యు.ఎస్ కార్యక్రమాలకు సంబంధించి జి.ఎస్.డబ్ల్యు.ఎస్ మండల అధికారి సచివాలయాలను తనిఖీ చేయాలని, చేయకపోతే చర్యలు తీసుకుంటామని, ప్రతి వారం మూడు తనిఖీలు చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహసిల్దార్లు కూడా గ్రామాలకు వెళ్ళినప్పుడు సచివాలయాలను తనిఖీ చేయాలని, సిటిజన్ రిజిస్టర్ కచ్చితంగా అమలుపరచాలని అలాగే ఈ కేవైసీపై దృష్టి పెట్టాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ పూర్తిగా నమోదయ్యేలా చూడాలన్నారు. పీఎం సూర్య ఘర్ కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సోలరైజేషన్ కి సంబంధించి పురోగతి తక్కువగా ఉందని, లక్ష్యానికి అనుగుణంగా యూనిట్లను ఇన్స్టాల్ చేయించాలని, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రోజుకు 145, మిగతా వారికి వారానికి 250 యూనిట్లను ఇన్స్టాల్ చేయించాలని, వాటికి సంబంధించి తనిఖీలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వ్యవసాయ శాఖ జెడి సాలు రెడ్డి,డ్వామా పిడి సలీమ్ భాష, హౌసింగ్ పిడి శైలజ, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, జిల్లా స్వర్ణ గ్రామ వార్డు కార్యాలయాల అధికారి నాసర రెడ్డి, డి ఆర్ డి ఎ పి డి శైలజ, డి ఎల్ డి ఓ విజయకుమార్ , అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపి పిడి రఘునాథ్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

"పొగాకు వాడకంతో అనారోగ్య సమస్యలు

డి యం హెచ్ ఓ .డా. శ్రీనివాసులు రెడ్డి
పొగాకు ఉత్పత్తులకు యువత ప్రజలు దూరంగా ఉండాలి
చీజ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విష్ణుమూర్తి
పొగాకు మానేద్దాం ఆరోగ్యాన్ని గెలుద్దాం
పొగాకుతో క్యాన్సర్ ముప్పు
పొగాకు రహిత సమాజం కోసం కృషి చేద్దాం
ఈగల్ టీం నోడల్ అధికారిహనుమంత్

అనంతపురం, ఆంధ్రజననాడు, జూన్ 01 : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మే 31 సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. శ్రీనివాసరెడ్డి, చీజన ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విష్ణుమూర్తి గారు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిగరెట్టు మరియు ఇతర పొగాకు సంబంధింత ఉత్పత్తుల యొక్క వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని పొగాకు మరియు వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలియజేశారు . కార్యక్రమానికి విచ్చేసిన వారందరి చేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు .ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి తెలుగు తల్లి కూడలి వరకు నిర్వహించడమైనది,, పొగాకు వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం అవుతోందని మరియు మనిషి యొక్క ఆయుష్ క్షీణిస్తోందని కావున పొగాకు ఏ రూపంలో వాడినా అది మానవాళి ఆరోగ్యాన్ని క్షీణింప చేస్తుందన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు ప్రైవేట్ విద్యాసంస్థల పరిధిలో ఉన్న దుకాణాలలో సిగరెట్ మరియు



ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదని తెలియజేశారు. అతిక్రమించిన వారిపై చట్టం ప్రకారం చర్య తీసుకోవడం జరుగుతుంది అన్నారు పొగాకు నియంత్రణ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ బి. విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ధూమపానం వినియోగంలో భారతదేశం రెండవ స్థానంలో ఉంది అలాగే దేశంలో సంభవించే అత్యవసర మరణాలలో ప్రతి వంద మందిలో పదిమంది బాధ్యులుగా ఉన్నారు అలాగే 15 నుంచి 24 సంవత్సరముల వయసు పిల్లలలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు సిగరెట్ ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తులను వాడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇలా యువత మారకద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల దేశ భవిష్యత్తు అగమ్య గోచరం కానుంది. సిగరెట్ వాడడం వలన అందులో ఉన్న నాలుగు వేల రకాల రసాయనాలు మనిషి యొక్క అవయవాలపై ప్రభావం చూపించి క్యాన్సర్ కు ముఖ్యంగా నోరు, గొంతు, ఊపిరితిత్తులు , జీర్ణాశయ మరియు జననేంద్రియ అవయవ క్యాన్సర్ కు కారణమవుతున్నాయి. అలాగే బహిరంగ ధూమపానము చేసిన మరియు ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని 100 గజాల లోపు ఎవరైనా దుకాణాలలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది మరియు జరిమానారూ:200 కూడాణ విధించడం జరుగుతుంది పొగాకు ఉత్పత్తులపై ఎటువంటి ప్రచారం నిర్వహించ రాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ ధూమపానం మరియు పాసివ్ స్మోకింగ్ వలన వల్ల గర్భవతులైన మహిళలు ఆరోగ్యవంతమైన సంతానాన్ని పొందలేరని తెలియజేశారు, సిగరెట్,బీడీ, గుట్కా, పాన్ మసాలా వాటిని సేవించడం వలన, ప్రధానంగా క్యాన్సర్, గుండె జబ్బులు ఊపిరితిత్తులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో చీజన ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విష్ణుమూర్తి , ఈగల్ టీం హనుమంతు, ఆర్ట్స్ కళాశాల చీరా అధ్యాపకులు,నాగభూషణ, డా. సుగప్ప,పరిపాలన అధికారి గిరిజ మనోహర్ , మలేరియా అధికారి ఓబులు, డెమో అధికారి నాగరాజులు లక్ష్మి నారాయణ , గంగాధర్ , యన్ హెచ్ యం సిబ్బంది కిషోర్ కుమార్ , ఫణి మరియు జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు మరియు ఎన్సీడీ సిబ్బంది జిల్లా ఫ్లో రోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు ప్రేమ్,కిషోర్, శశి, మౌనిక, పోలీస్ సిబ్బంది, విద్యాశాఖ విద్యాశాఖ అధికారులు, ఆశలు, వైద్య ఆరోగ్య సిబ్బంది,పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ

అనంతపురం, ఆంధ్రజననాడు, జూన్ 01 : అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునరెడ్డి, ఆనంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ల పంపిణీ

అనంతపురం నగరంలోని బుడ్డప్పనగర్ లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద
పెన్షన్లను పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

అనంతపురం, ఆంధ్రజననాడు, జూన్ 01 : అనంతపురం నగరంలోని 35వ సచివాలయం పరిధిలోని బుడ్డప్పనగర్ లో సోమవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పాల్గొని, లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నెలనెలా పెన్షన్లను పంపిణీ చేస్తున్నారా, ఎవరైనా డబ్బులు అడిగారా అంటూ ఆరా తీశారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా షేక్ నసీమా, పార్వతమ్మ, ఇమామ్ బి అనే లబ్ధిదారులకు 4 వేల చొప్పున వృద్ధాప్య పెన్షన్లను జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ వెంకట్రామిరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా నూతన బిజెపి అధ్యక్షుడు పివీ కృష్ణారావు ను ఘనంగా సన్మానించిన శిరసనగండ్ల శ్రీనివాసులు

ఎర్రగొండపాలెం ఆంధ్ర జన నాడు మే 1 : నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు భారతీయ జనతా పార్టీ తరపున నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పివీ కృష్ణారావును ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు శిరసన గండ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం నాడు మార్కాపురంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు పివి కృష్ణారావు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలవతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా పివీ కృష్ణారావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి మీయొక్క సహాయ సహకారాలు మాకు ఎంతో అవసరమని,త్వరలో అన్ని నియోజకవర్గాలు పర్యటించి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కిసాన్ మోర్చా మాజీ అధ్యక్షులు బొంతల కృష్ణ, మాజీ అసెంబ్లీ కన్వీనర్ అభ్యర్థి చిన్నయ్య, రాష్ట్ర ఓబిసి మాజీ కార్యవర్గ సభ్యులు దొంత బాధరయ్య గౌడ్,డాక్టర్ కిరణ్, జీవీ రెడ్డి మరియు పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అంతట మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించండి

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివా సులు రెడ్డి

అనంతపురం, ఆంధ్రజననాడు, జూన్ 01 : ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెల ఒకటవ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో, అన్ని గ్రామాలలో మలేరియా వ్యాధి నియంత్రణపై సభలు సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు రెడ్డి మరియు జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు సూచించారు. సోమవారం తన ఛాంబర్ నందు మలేరియా వ్యతిరేక మాసోత్సవాల బ్యానర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ , విద్యాశాఖ, మున్సిపాలిటీలలో మున్సిపల్ శాఖలు సంయుక్తముగా మలేరియా నివారణపై సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి 2030 సంవత్సరం నాటికి దేశంలో ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాకుండా ఉండే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి గిరిజా మనోహర్, గణాంక అధికారి మహమ్మద్ షఫీ,జిల్లా మాస్ మీడియా అధికారి నాగరాజు, ఎయిడ్స్ మరియు టి.బి విభాగం పారామెడికల్ ఆఫీసర్ నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గంగాధర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఇంచార్జ్ సహాయ మలేరియా అధికారి గిరిధర్ రెడ్డి, అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్వైజర్లు నూర్ భాషా, రాఘవేందర్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు మధుసూదన్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

డీఎస్సీ అక్రమాలపై అనంతలో 'యువజనాగ్రహం'

అనంతపురం, ఆంధ్రజననాడు, జూన్ 1 : డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆందోళన పెద్ద ఎత్తున హాజరైన యువజన విభాగం నేతలు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా "ఇది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ అంటూ" నినాదాలు ఆందోళనలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కూటమి ప్రభుత్వం యువత జీవితాలతో ఆడుకుంటోందని మండిపాటు విద్యాశాఖలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ మెగా డీఎస్సీలో దగాపడిన అభ్యర్థులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది : అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు అందజేసిన వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం నేతలు.

ఎర్రగొండపాలెంలో వృద్ధులకు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

ఎర్రగొండపాలెం ఆంధ్ర జన నాడు జూన్ 1 : యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు పట్టణంలోని బీసీ కాలనీలో 22వ బూత్ ఇంచార్జ్ దొంతా వెంకట్రావు గౌడ్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమం ఉదయం 7 గంటల నుండే సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ శ్రేణులు పాల్గొని పింఛన్ దారులకు పింఛన్ లను పంపిణి చేశారుకార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ -2 షేక్ మస్తాన్ వలి, క్లస్టర్ ఇంచార్జ్ -3 కంచర్ల సత్యనారాయణ గౌడ్, కో క్లస్టర్ ఇంచార్జ్ రామకృష్ణ , టీడీపీ నాయకులు నక్కా రాములు, కేశనపల్లి మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి పూల సుబ్బయ్య , పమిడిమర్రి కిషోర్ , విజయ్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సి జాబితా లోనే కొనసాగించాలి

ప్రజా సంఘాల ఐక్య వేదిక జేఏసీ

ఎర్రగొండపాలెం ఆంధ్ర జన నాడు జూన్ 1 : యర్రగొండపాలెం పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయ ఆవరణంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో దళిత క్రైస్తవులను ఎస్సి జాబితా లోనే కొనసాగించాలని,దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాల నుండి తొలగించాలని సుప్రీంకోర్టు తీర్పును వెనక్కి తీసుకోవాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక జేఏసీ డిమాండ్ చేసింది.ప్రజా సంఘాల ఐక్య వేదిక జేఏసీ అధ్యక్షుడు సింగా ప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన ఆర్టికల్ 25 ప్రకారం మతం అనేది వ్యక్తిగతమని,ఆ స్వేచ్ఛకు బంధం కలగకూడదనేది జేఏసీ ఉద్దేశం అని, ప్రభుత్వాలు వారి హక్కులని కాలరాయడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక జేఏసీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అమ్మవారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్

ఆంధ్ర జన నాడు ఎర్రగొండపాలెం జూన్ 1 : త్రిపురాంతకం మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం అయినటువంటి శ్రీ శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారిని సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిపురాంతకం మండల బిజెపి అధ్యక్షులు ముని మల్లికార్జున మరియు బిజెపి నాయకులు లంక దినకర్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా లంక దినకర్ మాట్లాడుతూ త్రిపురాంతకం వంటి పవిత్ర క్షేత్రాలు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని, రాష్ట్ర ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో , ఈఓ , ఆర్ఐ అలాగే త్రిపురాంతకం మండల బీజేపీ అధ్యక్షులు సముద్రాల ముని మల్లికార్జున రావు, జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రు పిచ్చయ్య , త్రిపురాంతక మండల ఉపాధ్యక్షులు పాతకోటి రాజేశ్వరరావు ,గురునాథం , శ్రీనివాసరెడ్డి , సోముడు తదితర నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

ఎర్రగొండపాలెం ఆంధ్ర జన నాడు జూన్ 1 : మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న బిలాల్ మసీదు ప్రాంతంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పాల్గొని వృద్ధులకు, వితంతువులకు పెన్షన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత మాట్లాడుతూ మొదటి రోజే పూర్తిస్థాయిలో పింఛన్లు లబ్ధిదారులకు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని , సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమములో , మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ స్కిడ్‌తో యువకుడు మృతి

స్నేహితుడికి తీవ్ర గాయాలు.

వెల్దుర్తి, ఆంధ్ర జననాడు, జూన్ 1 : వెల్దుర్తి మండల పరిధిలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ద్విచక్ర వాహనం అదుపు తప్పి స్కిడ్ కావడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.పోలీసులు, స్థానికుల కథనం మేరకు వెల్దుర్తికి చెందిన ఒంటెద్దుబండి దుబ్బన్న (నాగన్న) కుమారుడు మధు ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున తన స్నేహితుడు రాజేష్‌తో కలిసి డోన్ నుంచి ద్విచక్ర వాహనంపై వెల్దుర్తికి వస్తుండగా, జాతీయ రహదారిపై బైక్ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై స్కిడ్ అయింది.ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడటంతో హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే స్పందించి వారిని వెల్దుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ మధుకు తలకు, శరీరంలోని పలు భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమించింది. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మధు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.అదే ప్రమాదంలో గాయపడిన రాజేష్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.

ప్రమాదంపై కేసు నమోదు

సమాచారం అందుకున్న వెల్దుర్తి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. అధిక వేగం లేదా వాహనం నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

గ్రామంలో విషాద ఛాయలు

కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉన్న మధు అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. యువకుడి మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు.

రహదారి భద్రతపై పోలీసుల హెచ్చరిక

జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అప్రమత్తంగా ప్రయాణించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచించారు.

రీసర్వే పనులను ఎటువంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలి

రికార్డుల డిజిటలైజేషన్‌ను త్వరగా పూర్తి చేయాలి

రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

అనంతపురం,ఆంధ్రజననాడు జూన్ 01 : అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం సాయంత్రం రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ క్లినిక్స్, పిజిఆర్ఎస్, మ్యుటేషన్స్, పట్టాదారు పాస్ పుస్తకాలు, రీసర్వే, జీరో ఖాతాలు, 22ఏ కేసులు, డాటెడ్ ల్యాండ్స్, రీసర్వే, కోర్టు కేసులు, సెన్సెస్, సివిల్ సప్లయిస్, తదితర అంశాలపై డిఆర్ఓ ఏ.మలోలతో కలసి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే పనులను ఎటువంటి తప్పులు లేకుండా, చాలా నిక్కచ్చిగా మరియు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. రీసర్వే చేపట్టేందుకు కేవలం 6 నెలల సమయం మాత్రమే ఉందని, సమయం అయిపోయిన తర్వాత మళ్లీ పొడిగించమంటే కుదరదని, చివరి నిమిషంలో హడావుడి చేస్తూ తప్పులు చేయవద్దని, సకాలంలో రీసర్వే పూర్తి చేయాలన్నారు. సెన్సస్ (జనగణన) పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని, సమయం అయిపోతున్నా ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. తహశీల్దార్లు అందరూ ఎన్యుమరేటర్లతో దీనిపై ఫాలోఅప్ చేసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో కూడిన పరిష్కారాలు ఇస్తూ పరిష్కరించాలన్నారు. మ్యుటేషన్లు ఏవీ పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలని, రిజెక్ట్ చేయకుండా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని, నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫీల్డ్ ఎంక్వైరీలకు కేవలం తహసీల్దార్ లే కాకుండా డిప్యూటీ తహసీల్దార్లు మరియు ఆర్ఐలను కూడా భాగస్వామ్యం చేయాలని, డిటిలు కూడా క్షేత్రస్థాయికి వెళ్లాలని, దానివల్ల పనులు త్వరగా పూర్తవుతాయన్నారు.రికార్డుల డిజిటలైజేషన్ కు సంబంధించి తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న 1బి రికార్డులు, మ్యాన్యువల్ అడంగల్స్, 10(1) అడంగల్స్ రికార్డులను తీసుకొని రికార్డుల డిజిటలైజేషన్‌ను చాలా త్వరగా పూర్తి చేయాలన్నారు. సివిల్ సప్లైస్ కు సంబంధించి రేషన్ కార్డ్ దారులకు డీలర్లు కేజీ తక్కువ రేషన్ ఇస్తున్నారని చెబుతున్నారని, అయితే డీలర్లు తమకు స్టాక్ పాయింట్ నుంచే కేజీ తక్కువ వస్తోందని చెప్తున్నారని, సివిల్ సప్లైస్ డిఎం ఏ లైన్‌కు ఎప్పుడు స్టాక్ వస్తుందో షెడ్యూల్ ఇచ్చి ఉంటారని, కాబట్టి స్టాక్ మూమెంట్ ఉన్నప్పుడు డీలర్లు స్వయంగా వెళ్లి, బస్తాల లెక్కన కాకుండా మీకు కావలసిన బరువు తూకం వేయించుకుని పూర్తిగా రేషన్ తీసుకోవాలన్నారు. 50 కేజీల బస్తాలో 48 కేజీలే వస్తే, మిగిలిన 2 కేజీలను లూజ్‌గా ఇస్తున్నారు కాబట్టి డీలర్లు అక్కడే ఉండి అడిగి తీసుకోవాలని, డిఎం కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం నుంచి ఆ ప్రొవిజన్ ఉందని, డీలర్లు స్వయంగా వెళ్లి స్టాక్ తెచ్చుకోకుండా, మాకు స్టాక్ పాయింట్ నుంచి తక్కువ వచ్చిందని సాకులు చెప్పడం తగదని, ఈ విషయాన్ని ఎఫ్.పి షాప్ డీలర్లకు కఠినంగా చెప్పాలని సిఎస్డిటిలను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ప్రతి పనిలోనూ ప్రత్యేక చొరవ తీసుకుని నాణ్యమైన సేవలను ప్రజలకు అందించాలని ఆదేశించారు. వెనుకబడిన అంశాల్లో పురోగతి తీసుకురావాలని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో ఆర్డీఓలు వసంత బాబు, శ్రీనివాస్, సివిల్ సప్లయ్ డిఎం రమేష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు రియాజుద్దీన్, యుగేశ్వరిదేవి, అన్ని మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సిఎస్డిటిలు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందిలో మానసిక ప్రశాంతతను పెంపొందించి, పనితీరుని మెరుగుపరచడమే లక్ష్యంగా హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహణ

గుంటూరు, ఆంధ్రజననాడు, జూన్ 01 : గుంటూరు జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిలో మానసిక స్థైర్యం, భావోద్వేగ సమతుల్యత మరియు విధి నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్స్టిట్యూట్ సహకారంతో ప్రత్యేక మెడిటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్, ఐపీఎస్ గారు తెలిపారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ (ఏఆర్) శ్రీ ఏ. హనుమంతు గారి పర్యవేక్షణలో జిల్లా కేంద్రంతో పాటు వివిధ సబ్ డివిజన్ల పరిధిలో మూడు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది.గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సూచనలు, రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసు సిబ్బందికి మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి, అత్యవసర పరిస్థితులు, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మెడిటేషన్ ఎంతగానో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.నిర్వహించిన రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో గుంటూరు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు సీఐడీ, ఈగల్ విభాగాల అధికారులు, గుంటూరు రేంజ్ కార్యాలయం మరియు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది కలిపి సుమారు 338 మంది పాల్గొన్నారు.హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్స్టిట్యూట్ గుంటూరు జోనల్ కోఆర్డినేటర్ రామ కోటేశ్వరరావు గుంటూరు-బాపట్ల జిల్లాల కోఆర్డినేటర్ శ్రీమతి విజయలక్ష్మి శిక్షణ అందిస్తూ మానసిక ఒత్తిడిని అధిగమించే పద్ధతులు, సానుకూల ఆలోచన విధానం, ఏకాగ్రత పెంపు, భావోద్వేగ నియంత్రణ మరియు ధ్యానం ద్వారా అంతర్మనస్సు శుద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ధ్యానం ద్వారా మనస్సులో ఏర్పడిన ప్రతికూల ముద్రలను తొలగించి ప్రశాంత జీవన విధానాన్ని అలవర్చుకునే మార్గాలను వివరించారు. ఉద్యోగ బాధ్యతల ఒత్తిడిని తగ్గించుకోవడంలో మెడిటేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని గుంటూరు రేంజ్ నోడల్ అధికారి డీఎస్పీ సంకురయ్య పర్యవేక్షణలో, జిల్లా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి రెడ్డి జిల్లా నోడల్ అధికారిసమన్వయం చేశారు.అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు , తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ , తెనాలి డీఎస్పీ జనార్ధన్‌రావు, మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ చిరుమామిళ్ళ. వెంకట్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.జిల్లా వ్యాప్తంగా హోంగార్డు స్థాయి నుండి అదనపు ఎస్పీ స్థాయి వరకు అన్ని విభాగాల పోలీసు అధికారులు, సిబ్బందికి దశలవారీగా హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణను అందించనున్నట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాటలో సిపిఐ రైతు సంఘం

ఎరువుల ధరల తగ్గింపు, రుణమాఫీ సహా పలు డిమాండ్లతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా.

వెల్దుర్తి,ఆంధ్ర జననాడు, జూన్ 1 : వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో రైతులకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని సిపిఐ మరియు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు భారంగా మారిన రసాయన ఎరువుల ధరలను వెంటనే తగ్గించడంతో పాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అధిక సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం వెల్దుర్తి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘం నాయకుడు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టీ. కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీ. కృష్ణ మాట్లాడుతూ, పెరుగుతున్న సాగు వ్యయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు, రసాయన ఎరువులు అందించడంతో పాటు మార్కెట్లో పెరుగుతున్న ఎరువుల ధరలను అదుపులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.వెల్దుర్తి మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలని, నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందేలా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని సూచించారు.అలాగే 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ప్రస్తుతం అందిస్తున్న రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని రూ.50 వేలకు పెంచాలని, రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సంపూర్ణ రుణమాఫీ అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. ప్రతి రైతుకు నెలకు రూ.5 వేల రైతు పెన్షన్ అందించే విధంగా ప్రత్యేక పథకం తీసుకురావాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గిరిబాబు, పట్టణ సహాయ కార్యదర్శి చిన్న మాదులు, మండల సహాయ కార్యదర్శి కోకిల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు అనీలు, గురుపాదయ్య, శ్రీరాములు, మాదన్న తదితరులు పాల్గొన్నారు."రైతు సంక్షేమమే రాష్ట్రాభివృద్ధికి పునాది" అంటూ నాయకులు ప్రభుత్వానికి పలు కీలక డిమాండ్లు వినిపించారు.

నేడు వెల్దుర్తిలో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ

మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి హాజరు

వెల్దుర్తి, ఆంధ్ర జననాడు, జూన్ 1 : వెల్దుర్తి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు), అనుబంధ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్న ఈ సమావేశానికి పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, బూత్ స్థాయి కమిటీల పనితీరు తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.అలాగే రానున్న రాజకీయ పరిణామాలు, ప్రజలతో పార్టీ నాయకులు మరింత మమేకం కావాల్సిన అవసరం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై చేపట్టాల్సిన ఉద్యమాలు, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి కీలక అంశాలపై మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.మండల వ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించేందుకు బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంపొందించే చర్యలపై కూడా చర్చ జరగనుంది.ఈ నేపథ్యంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు, యువజన, మహిళా, రైతు, విద్యార్థి విభాగాల ప్రతినిధులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది.ఈ సమావేశం ద్వారా మండలంలో పార్టీ కార్యకలాపాలకు మరింత ఊపు తీసుకురావడంతో పాటు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు స్పష్టమైన మార్గదర్శకత్వం లభిస్తుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఇళ్ల రుణాల పేరుతో భారీ మోసం

గ్రామస్తులను నమ్మించి లక్షలు కాజేసిన వ్యక్తి అరెస్ట్

బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు - విచారణ ప్రారంభం

వెల్దుర్తి, ఆంధ్ర జననాడు, జూన్ 1 : కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని మల్లేపల్లి గ్రామంలో ఇళ్ల రుణాల పేరుతో పలువురు గ్రామస్తులను మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు శాంత కుమార్ అనే వ్యక్తిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.గ్రామస్తుల కథనం ప్రకారం, శాంత కుమార్ తాను వివిధ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ద్వారా సులభంగా ఇళ్ల రుణాలు ఇప్పించగలనని నమ్మబలికాడు. రుణం మంజూరైన తర్వాత మొత్తం రుణంలో సగం మొత్తాన్ని తాను తీసుకుని, మిగతా సగం మొత్తాన్ని లబ్ధిదారులకు ఇస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని, తాను అన్ని వ్యవహారాలను చూసుకుంటానని హామీ ఇచ్చి అమాయక గ్రామస్తులను నమ్మించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.అతని మాటలను నమ్మిన పలువురు గ్రామస్తులు తమ ఇళ్లకు సంబంధించిన పత్రాలు, వ్యక్తిగత వివరాలు అందించి రుణాల ప్రక్రియలో పాల్గొన్నారు.ప్రారంభంలో ఎలాంటి అనుమానాలు రాకపోయినా, కొంతకాలం తర్వాత ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు రుణాల బకాయిల చెల్లింపుల కోసం బాధితులను సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. ఫైనాన్స్ సంస్థల నుంచి నిరంతరం ఒత్తిడి పెరగడంతో మోసపోయిన గ్రామస్తులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. తాము ఎలాంటి రుణ బాధ్యతలు ఉండవని నమ్మించి మోసం చేశాడని ఆరోపిస్తూ బాధితులు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసును నమోదు చేసి విచారణ ప్రారంభించారు.ఇదిలా ఉండగా, కొంతకాలంగా గ్రామానికి దూరంగా ఉన్న శాంత కుమార్ తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడన్న సమాచారం బాధితులకు అందింది. దీంతో గ్రామస్తులు అతడిని అడ్డగించి నిలదీశారు. ఆగ్రహానికి గురైన కొందరు బాధితులు అతనిపై దాడికి యత్నించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.పోలీసుల జోక్యంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంత కుమార్‌ను సురక్షితంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతన్ని వెల్దుర్తి పోలీసులకు అప్పగించారు.ఈ ఘటనపై వెల్దుర్తి ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. మోసానికి గురైన వారి సంఖ్య, రుణాల మొత్తం విలువ, ఇతరుల ప్రమేయం వంటి అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విచారణ పూర్తైన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.ఇళ్ల రుణాల పేరుతో జరిగిన ఈ మోసం మల్లేపల్లి గ్రామంలో కలకలం రేపగా, ఆర్థిక లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

అద్దెలే కట్టలేక'పోతున్నాం'

హైదరాబాద్ నగర శివార్లలో ఇళ్లు వెతుక్కుంటున్న ఉద్యోగులు!

హైదరాబాద్ మహా నగరంలో ఏటికేడు పెరుగుతున్న ఇంటి అద్దెలు

మధ్య తరగతి కుటుంబాలపై మోయలేని భారం

భారీ అద్దెలు భరించలేక నగర శివార్లలో ఉండేందుకు మొగ్గు చూపుతున్న ఉద్యోగులు

భాగ్యనగరం ఐటీ, ఫార్మా రంగాల్లో సాధిస్తున్న అద్భుతమైన ప్రగతి కారణంగా దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా నిలిచింది. ఈ వేగవంతమైన ఆర్థిక వృద్ధి వెనక మధ్య, దిగువ మధ్య తరగతి కుటుంబాలు ఒక తీరని ఆర్థిక భారాన్ని మోస్తున్నాయి. అదే నగరంలో విపరీతంగా పెరుగుతున్న ఇళ్ల అద్దెలు. గత మూడు నాలుగు ఏళ్లుగా నగరంలో నివాస గృహాల అద్దెలు ఊహించని రీతిలో 50 శాతం నుంచి 60 శాతం వరకు పెరగడం సామాన్యుల రోజువారీ జీవితాలను పూర్తిగా అతలాకుతలం చేస్తోంది. హైదారాబాద్ మహానగరంలో సామాన్య, మధ్య తరగతి వర్గాలకు ఇళ్లు కొనడమే కాదు, కనీసం కిరాయికి ఉండాలన్నా భారంగానే మారింది. నగరంలో ఏటికేడు అద్దెలు భారీగా పెంచటమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. సాధారణంగా వేసవి సెలవుల్లో ఇళ్లు ఎక్కువగా ఖాళీ అవుతుంటాయి. మళ్లీ తిరిగి జూన్ నెలలో భర్తీ అవుతాయి. ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్స్, పిల్లలు కొత్త విద్యాసంస్థల్లో చేరడం, జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చేవారు కిరాయి ఇళ్ల కోసం వెతుకుతున్నారు. ప్రస్తుతం భారీగా అద్దెలు ఉంటున్న తరుణంలో భరించలేక నగర శివార్లలో ఉంటున్నారు. ఐటీ కారిడార్, ఉపాధి అవకాశాలు ఉన్నచోట రెంట్లు అధికం. మణికొండ పంచవటి కాలనీలో 3 బీహెచ్‌కే ఫ్లాట్ అద్దె రూ.40 నుంచి రూ.50 వేల మధ్య ఉంది. 2 బీహెచ్‌కేకు రూ.25 నుంచి రూ.30 వేల వరకు చెబుతున్నారు. వీకర్ సెక్షన్ ప్రాంతానికి వెళ్తే రూ.18 నుంచి రూ.20 వేల వరకు ఉన్నాయి. బాచుపల్లిలో కొత్త ఫ్లాట్లలో 2 బీహెచ్‌కే అద్దె దాదాపుగా రూ.20 వేల వరకు ఉంది. కిస్మత్‌పూర్‌లో అయితే రూ.25 వేల వరకు చెబుతున్నారు. కేపీహెచ్‌బీలో పాత ఫ్లాట్లలో రూ.20 నుంచి రూ.25 వేల వరకు రెంట్లు ఉన్నాయి. ఐటీ కారిడార్‌లోని మాదాపూర్, కొండాపూర్, తెల్లాపూర్, నల్లగండ్ల, గండిపేట, గచ్చిబౌలి, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీల్లో 2 బీహెచ్‌కే రూ.40 నుంచి రూ.50 వేల వరకు చెబుతున్నారు. 3 బీహెచ్‌కేకు రూ.60 నుంచి రూ.80 వేలు. విల్లాలకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు చెల్లిస్తున్న వారు కూడా ఉన్నారు. మెయింటనెన్స్ రూ.2 నుంచి రూ.6 వేల వరకు ఉంటాయి. మళ్లీ దీనికి కరెంటు, నీటి బిల్లులు అదనం. రూ.లక్షల్లో జీతాలు, భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తుంటే మాత్రం ఇంటి అద్దెకు పెద్ద సమస్య కాదు. రూ.50 వేలలోపు శాలరీ తీసుకుంటున్న వారు అద్దెలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు ఫీజులు, ఆరోగ్యం కోసమే సగం శాలరీ ఖర్చు చేయాల్సి ఉంటోంది. ఇక ఇంటి అద్దె రూ.20 వేలు కట్టలేక సింగిల్ బెడ్‌రూం ఇంటికి, శివార్లలో రూ.10 వేలలోపు రెంట్లు ఉండే ఇళ్లకు వెళ్లి సర్దుకుంటున్నారు. ఐటీ కారిడార్‌లో పని చేసే ఒక ఉద్యోగి తన బడ్జెట్‌లో ఇంటి అద్దెలు ఉండటంతో ఘట్‌కేసర్ సమీపంలోని ఈసీఐఎల్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. కానీ ట్రాఫిక్ కారణంగా రోజూ రాకపోకలకు 4 గంటల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆకాశాన్ని తాకుతున్న భూముల ధరలతో ఇళ్ల నిర్మాణ వ్యయం పెరిగి ఆ ప్రభావం నేరుగా రెంట్లపై పడుతోంది. రూ.కోటి లేనిదే సౌకర్యంగా ఉండే ఇల్లు కొనే పరిస్థితులు ఇప్పుడైతే కనిపించడం లేదు. ఒకప్పుడు లోన్ తీసుకుని ఇంటిని నిర్మించి ఉంటే వచ్చే కిరాయిలు ఈఎంఐకి సరిపోవాలని యజమానులు ఆశిస్తున్నారు. ముంబయిలో లోకల్ ట్రైన్ ఉండటంతో దూరమైనా గంటలో సిటీకి చేరుకుంటారు. అద్దెలు భారమై జనం శివార్లకు వెళ్తున్న నేపథ్యంలో వారి కోసం ప్రభుత్వం ప్రజా రవాణా సౌకర్యాలు మరింత పెంచాల్సి ఉంది. అదే విధంగా చూస్తే మెట్రోను విస్తరించాలని తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి.రావు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఐపీఎల్ విజయోత్సవాల పేరుతో విధ్వంసం.. 18 మంది అరెస్టు

సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల గుర్తింపు - కోర్టుకు తరలింపు

ప్రజా, ప్రైవేట్ ఆస్తుల ధ్వంసం సహించబోమన్న టూ టౌన్ సీఐ శ్రీధర్

కర్నూలు, ఆంధ్ర జాననాడు,జూన్ 1 : ఐపీఎల్ క్రికెట్ ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయం సాధించిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవాలు కర్నూలు నగరంలో కొంతమంది యువకుల అత్యుత్సాహంతో ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. రాజ్ విహార్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులతో పాటు బస్సుల అద్దాలను ధ్వంసం చేసి నష్టం కలిగించిన ఘటనపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు టూ టౌన్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టాయి. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీలు, సోషల్ మీడియా వీడియోలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించిన పోలీసులు విధ్వంసానికి పాల్పడిన 18 మంది వ్యక్తులను గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి కోర్టు వరకు నడిరోడ్డుపై తీసుకెళ్లి తరలించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రజా ఆస్తులు, ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేట్ ఆస్తుల ధ్వంసానికి పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. విజయోత్సవాలు, పండుగలు, ఇతర వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను పోలీసులు కఠినంగా అణచివేస్తారని అధికారులు తెలిపారు.

కుమారుడిని చంపి మిస్సింగ్ అంటూ డ్రామా

ఏడాదిన్నర తర్వాత గుట్టురట్టు!

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని కుమారుడిని చంపిన తల్లి

ఏడాదిన్నర తర్వాత మృతదేహం వెలికితీత

నిజం నిగ్గుతేలిన వేళ తల్లి అనుమానాస్పద మృతి

నేటి కాలంలో వివాహేతర సంబంధాలు దాంపత్య బంధాన్ని కడతేర్చుతున్నాయి. ఓ వైపు ఆ మోజులో పడి కట్టుకున్న వాడిని, కడుపున పుట్టిన పిల్లలను వదిలేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు అడ్డొస్తే చంపడానికి సైతం వెనకాడటం లేదు. ఆ తర్వాత జరిగే పరిణామాలు తెలిసినా క్షణిక సుఖాల కోసం కుటుంబాలను వీధిపాలు చేస్తున్నారు. తద్వారా జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. వివాహేతర సంబంధాలు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయనడానికి ఈ ఘటనే తాజా ఉదాహరణ. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కుమారుడిని ప్రియుడితో కలిసి ఓ తల్లి చంపేసింది. అంతేకాక తన బిడ్డ కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంతటితో ఆగకుండా ఈ మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించడం లేదంటూ హైకోర్టు మెట్లెక్కింది. చివరికి నిజం బయటపడే సమయానికి ఆ తల్లి అనుమానస్పద రీతిలో మృతిచెందింది. మానవ సంబంధాలకే మచ్చతెచ్చే ఈ ఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. కౌతాళం మండలం బదినేహాలు గ్రామంలో చెందిన చిన్నమల్లయ్య, గంగమ్మ దంపతులకు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. చిన్నమల్లయ్య కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డుప్రమాదంలో మరణించాడు. గంగమ్మకు ఆదోని మండలం జి.హొసళ్లి గ్రామానికి చెందిన బంధువు దర్గప్పతో వివాహేతర సంబంధం ఏర్పడింది. దర్గప్ప తరచూ తమ ఇంటికి రావడం నచ్చని గంగమ్మ పెద్దకుమారుడు వీరేశ్(17) అతనితో పలుమార్లు ఘర్షణకు దిగాడు. దీంతో వీరేశ్‌ను అడ్డు తొలగించుకోవాలని గంగమ్మ, దర్గప్ప పథకం వేశారు. ఈ క్రమంలో 2024 నవంబర్‌లో ఇంట్లోనే వీరేశ్‌ను కత్తితో పొడిచి చంపేశారు. మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి, బైక్‌పై తీసుకెళ్లి సమీప శ్మశానంలో పాతిపెట్టారు. మరోవైపు గంగమ్మ, తన కుమారుడు వీరేశ్ కనిపించడం లేదని 2024 నవంబరు 11న గంగమ్మ కౌతాళం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈ కేసును కొలిక్కి తేలేకపోయారు. హైకోర్టును ఆశ్రయిస్తే ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని కొందరు సలహా ఇవ్వడంతో గంగమ్మ ఆశపడింది. తన కుమారుడి ఆచూకీ తెలియడం లేదని, పోలీసులు సరిగ్గా వెతకడం లేదని ఇటీవల పిటిషన్ వేసింది. దీన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించి, వీరేశ్ అదృశ్యంపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీకి ఆదేశాలిచ్చింది. స్పందించిన డీజీపీ ఈ కేసు దర్యాప్తునకు గుంటూరు సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ, డీఎస్పీ రవికుమార్ తదితరులతో కలిపి సిట్ వేశారు. రెండు వారాలుగా సిట్ సభ్యులు ఆరాతీయగా గంగమ్మ కిరాతకం వెలుగులోకి వచ్చింది. వీరేశ్‌ను గంగమ్మ, దర్గప్పలు కలిసి చంపేసినట్లు నిర్ధారించుకున్నారు. పోలీసులు ఆదివారం జి.హొసళ్లికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. అస్థిపంజరం వద్ద దొరికిన తాడు, టవల్, దుప్పటి చూసి మృతుడి కుటుంబసభ్యులు అవి వీరేశ్‌వని గుర్తించారు. అస్థిపంజరం నుంచి నమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని పోలీసులు పేర్కొన్నారు. ఇంతలో ఆదివారం గంగమ్మ అనుమానాస్పదస్థితిలో మరణించడం సంచలనంగా మారింది. అనారోగ్యంతో రెండు రోజుల కిందట ఆమె ఆదోని ఆసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా మారడంతో మైరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి శనివారం నాడు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోలీసు బందోబస్తు మధ్య బదినేహాలుకు తీసుకొచ్చి హడావుడిగా అంత్యక్రియలు జరిపించారు. గంగమ్మది లాకప్‌డెత్ అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమెను పోలీసులు విచారణకు తీసుకెళ్లాకే లాకప్‌లో చనిపోయిందని గ్రామస్థులు ఆరోపించారు. సహజ మరణమే అయితే పోలీసుల పర్యవేక్షణలో హడావుడిగా అంత్యక్రియలు ఎందుకు జరిపించారని వారు ప్రశ్నించారు. సిట్ అధికారులకు ఈనాడు ప్రతినిధులు ఫోన్ చేయగా స్పందించలేదు. గంగమ్మది అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. వీరేశ్ హత్య కేసులో దర్గప్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గనుల డిపోలో భారీ పేలుడు.. మయన్మార్‌లో 55 మంది మృతి

చైనా సరిహద్దు సమీపంలోని తిరుగుబాటుదారుల ప్రాంతంలో ఘటన

మృతుల్లో 25 మంది మహిళలు, ఆరుగురు చిన్నారులు

వాయుసేన దాడి అని పొరబడిన స్థానిక ప్రజలు

రసాయనాల అస్థిరత వల్లే ప్రమాదమని తిరుగుబాటు గ్రూపు వెల్లడి

అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న మయన్మార్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తిరుగుబాటుదారుల నియంత్రణలో ఉన్న షాన్ రాష్ట్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. గనుల తవ్వకాల కోసం నిల్వ ఉంచిన పేలుడు పదార్థాల డిపో ఒక్కసారిగా పేలిపోవడంతో 55 మంది ప్రాణాలు కోల్పోగా, 74 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. చైనా సరిహద్దుకు కేవలం 3 కిలోమీటర్ల దూరంలోని నమ్‌ఖామ్ టౌన్‌షిప్ పరిధిలోని కౌంగ్ టాట్ గ్రామంలో ఈ విషాదం జరిగింది. మృతుల్లో 30 మంది పురుషులు, 25 మంది మహిళలు ఉన్నట్లు స్థానిక మీడియా సంస్థలు, బీబీసీ కథనాలు వెల్లడించాయి. పేలుడు ధాటికి సమీపంలోని సుమారు 100 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. మయన్మార్‌లో సైనిక ప్రభుత్వానికి, తిరుగుబాటు గ్రూపులకు మధ్య పోరాటం జరుగుతున్న నేపథ్యంలో తొలుత ఈ పేలుడును ప్రభుత్వ సైన్యం జరిపిన వైమానిక దాడిగా స్థానికులు భావించారు. ఆకాశంలో దట్టమైన నల్లటి పొగలు కమ్ముకోవడంతో ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే, ఇది ప్రమాదవశాత్తూ జరిగిందని తర్వాత స్పష్టత వచ్చింది. ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ ఈ ఘటనపై స్పందించింది. గనులు, క్వారీల కోసం తమ ఆర్థిక విభాగం నిల్వ ఉంచిన 'జెలిగ్నైట్' వంటి పేలుడు పదార్థాలు అస్థిరత కారణంగా పేలిపోయాయని ఓ ప్రకటనలో తెలిపింది. బాధితులకు సహాయం అందిస్తామని, ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం స్థానిక స్వచ్ఛంద సంస్థలు సహాయక చర్యలు చేపట్టాయి.

పులులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై దృష్టి

శ్రీశైలం ఘాట్‌లో పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

డబ్ల్యూఐఐతో అధ్యయనం చేయించాలని నిర్ణయించిన ఎన్‌హెచ్‌ఏఐ

వంతెన అందుబాటులోకి వస్తే రాత్రి సమయంలోనూ ఘాట్‌లో రాకపోకలు

నల్లమల్ల అటవీ ప్రాంతం పరిధి శ్రీశైలం ఘాట్‌లో ఎలివేటెడ్ వంతెన నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుంది. అయితే ఆ పరిసరాల్లో నివసించే పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలనే అంశంపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు దృష్టి పెట్టారు. అందులో భాగంగా వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ)తో అధ్యయనం చేయించాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో దోర్నాల నుంచి శ్రీశైలం డ్యాం సమీపం వరకు, అలాగే తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ వైపు ఉన్న బ్రాహ్మణపల్లి నుంచి జలాశయం వరకు జాతీయ రహదారి-765ని విస్తరించేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) సిద్ధమైంది. అయితే నాలుగు వరుసలుగా హైవే విస్తరణకు పెద్దఎత్తున అటవీ భూమి అవసరం ఉంటుంది. దీనికి బదులు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 41.39 కి.మీ., తెలంగాణ రాష్ట్రంలో 45.35 కి.మీ. కలిపి మొత్తం 86.74 కి.మీ. మేర ఎలివేటెడ్ వంతెన నిర్మించేలా అధికారులు ప్రతిపాదించారు. దీంతో వంతెనకు అవసరమైన పిల్లర్లు నిర్మించేందుకు తప్ప, ఎక్కడ పెద్దఎత్తున అటవీ భూమి అవసరం ఉండదు. ఈ ప్రతిపాదన నేపథ్యంలో వన్యప్రాణుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధికారులు దృష్టి సారించారు. ఎలివేటెడ్ వంతెన నిర్మించాలనుకునే చోట నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్, అలాగే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతాలు ఉన్నాయి. దీంతో డబ్ల్యూఐఐ బృందం ఈ ప్రాంతంలో పులులు ఎక్కువగా ఎటువైపు రాకపోకలు సాగిస్తుంటాయి అనే దానిపై దృష్టి పెట్టారు. అంతేగాక వాటి కదలికలు ఎక్కడ అధికంగా ఉంటాయి, తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నారు. వన్యప్రాణులు తిరిగేందుకు కల్వర్టులు వంటి నిర్మాణాలు ఎక్కడెక్కడ అవసరం, ఎలివేటెడ్ వంతెన ఎత్తు ఎక్కడెక్కడ ఎంత ఉండాలి వాటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే ఏమేం చేయాలి తదితర అంశాలపై డబ్ల్యూఐఐ నివేదిక ఇస్తుంది. అదేవిధంగా కారిడార్ నిర్మాణానికి జాతీయ వన్యప్రాణుల బోర్డు నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం డబ్ల్యూఐఐ నివేదిక ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ అధ్యయనం ఓ కొలిక్కివస్తే ఎలివేటెడ్ వంతెన నిర్మాణంపై త్వరగా ముందడుగు పడే అవకాశం ఉందని ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు. అలాగే ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఇటు ఏపీలో దోర్నాల వైపు నుంచి, అటు హైదరాబాద్ వైపు నుంచి శ్రీశైలం క్షేత్రానికి వేగంగా చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాత్రివేళ ఘాట్‌లో రాకపోకలకు అనుమతి లేదు. ఈ ఎలివేటెడ్ వంతెన అందుబాటులోకి వస్తే ఏ సమయంలోనైనా శ్రీశైలానికి వాహనాలు చేరుకొనే వీలు కలుగుతుంది.

ఆర్సీబీ డబుల్ ధమాకా.. బెంగళూరులో రాత్రంతా రోడ్లపై ఫ్యాన్స్ హంగామా

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయం సాధించగానే బెంగళూరు వీధుల్లో అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. అయితే, గతేడాది టైటిల్ గెలిచిన సమయంలో జరిగిన ఘోర విషాద ఘటనను దృష్టిలో ఉంచుకుని, ఈసారి బెంగళూరు పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. గతేడాది చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన పునరావృతం కాకుండా నగర పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. నగరం ప్రధాన ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించి, అభిమానుల సంబరాలు అదుపు తప్పకుండా చూశారు. డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలు, వేగ నియంత్రణ కోసం కొన్ని రోడ్లను మూసివేయడం వంటి చర్యలు తీసుకున్నామని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ తెలిపారు. "ప్రజలు సరైన స్ఫూర్తితో సంబరాలు చేసుకోవాలి. శాంతికి భంగం కలిగించవద్దు" అని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసుల పహారా మధ్యలోనే ఫ్యాన్స్ రోడ్లపైకి వచ్చి డ్యాన్సులు చేస్తూ, తమ జట్టు విజయాన్ని, స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ప్రదర్శనను కొనియాడుతూ ఆనందాన్ని పంచుకున్నారు. ఛేజింగ్‌లో కోహ్లీ అజేయ అర్ధ సెంచరీతో రాణించడం వారి ఆనందాన్ని రెట్టింపు చేసింది. ఈ సంతోష సమయంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ గతేడాది మరణించిన అభిమానులను స్మరించుకోవడం అందరినీ కదిలించింది. ఈ విజయం తనకు అద్భుతమైన పుట్టినరోజు కానుక అని పేర్కొన్నాడు. ఆ విషాద ఘటనకు నివాళిగా చిన్నస్వామి స్టేడియంలో 11 శాశ్వత సీట్లను వారి జ్ఞాపకార్థం కేటాయించారు. గతేడాది ఘటన తర్వాత దాదాపు 8 నెలల పాటు చిన్నస్వామి స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగలేదు. పలు తనిఖీల తర్వాతే బీసీసీఐ మళ్లీ అనుమతులు ఇచ్చింది. భారత్‌లో ఏ వేదికపై ఆడినా తమకు మద్దతు లభిస్తుందని, 'మాకు ఏడు కాదు, 14 హోమ్ గేమ్‌లు' అని విరాట్ కోహ్లీ వ్యాఖ్యానించడం జట్టుకు ఉన్న అశేష అభిమాన గణానికి నిదర్శనం.

మే నెలలో తిరుమలకు పోటెత్తిన భక్తులు

తిరుమల శ్రీవారి ఆలయానికి మే నెలలో భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు, విద్యాసంస్థలకు విరామం కావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో మే మాసంలో శ్రీవారి దర్శనాలు, హుండీ ఆదాయం, తలనీలాల సమర్పణలో కొత్త రికార్డులు నమోదైనట్లు టీటీడీ తాజాగా గణాంకాలను విడుదల చేసింది. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మే నెలలో మొత్తం 25,46,168 మంది భక్తులు శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, భక్తుల రద్దీ తగ్గలేదు. రద్దీకి అనుగుణంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా సర్వదర్శనం భక్తులు వేచి ఉండే కంపార్ట్‌మెంట్లలో నిరంతరాయంగా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలు అందించి వారికి ఇబ్బంది కలగకుండా చూసింది. స్వామివారిపై తమకున్న భక్తిని భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. మే నెలలో శ్రీవారి హుండీ ద్వారా రికార్డు స్థాయిలో రూ.120.28 కోట్ల ఆదాయం లభించింది. ఒకే నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం తిరుమల చరిత్రలోనే అరుదు. నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా భక్తులు పెద్దఎత్తున సమర్పించారు. ఇక, మే నెలలో 12,29,773 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మీరు చిరంజీవిలా బంగీ జంపింగ్ చేయాలనుకుంటున్నారా.. మన దేశంలో బెస్ట్ ప్లేసెస్ ఇవే..

రోటీన్ లైఫ్ బోర్ కొడుతోంది.. డిఫరెంట్ గా జీవితంలో కొంత సమయం అయినా గడపాలని కోరుకుంటున్నారా... ఉత్తేజకరమైన సంఘటనలను అనుభవించాలనుకుంటే.. భారతదేశంలో మీకు అనువైన ప్రదేశాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా దైర్యసాహస కార్యక్రమాలను ఇష్టపడేవారు బంగీ జంపింగ్ చేయాలనీ భావిస్తారు. అటువంటి వారు మన దేశంలో ఈ ప్రదేశాలను తప్పక సందర్శించాలి. ఇవి మీ ప్రయాణ ఆనందాన్ని రెట్టింపు చేస్తాయి. అందరికీ కొత్త ప్రదేశాలకు వెళ్ళడానికి.. ప్రయాణం చేయడం అంటే ఇష్టమే. మీకు నచ్చిన ప్రదేశాలకు వెళ్ళడం వలన మీలోని ఒత్తిడిని, అలసటను తగ్గిస్తుంది. ప్రతి సంవత్సరం ప్రజలు వేసవి సెలవుల్లో కొత్త ప్రదేశాలకు ప్రయాణించాలని ప్లాన్ చేసుకుంటారు. కనుక మీరు కూడా ఈ సెలవులను చిరస్మరణీయంగా మార్చుకోవాలనుకుంటే.. భారతదేశంలో సాహసాలు చేసేందుకు అనువైన కొన్ని ప్రదేశాలను సందర్శించవచ్చు. అక్కడ మీ మనసును రిఫ్రెష్ చేయడమే కాకుండా..వాటిని గుర్తుచేసుకున్నప్పుడు మీ ముఖంలో చిరునవ్వు తెచ్చే అందమైన అనుభవాన్ని కూడా పొందుతారు. అందరికీ కొత్త ప్రదేశాలకు వెళ్ళడానికి.. ప్రయాణం చేయడం అంటే ఇష్టమే. మీకు నచ్చిన ప్రదేశాలకు వెళ్ళడం వలన మీలోని ఒత్తిడిని, అలసటను తగ్గిస్తుంది. ప్రతి సంవత్సరం ప్రజలు వేసవి సెలవుల్లో కొత్త ప్రదేశాలకు ప్రయాణించాలని ప్లాన్ చేసుకుంటారు. కనుక మీరు కూడా ఈ సెలవులను చిరస్మరణీయంగా మార్చుకోవాలనుకుంటే.. భారతదేశంలో సాహసాలు చేసేందుకు అనువైన కొన్ని ప్రదేశాలను సందర్శించవచ్చు. అక్కడ మీ మనసును రిఫ్రెష్ చేయడమే కాకుండా..వాటిని గుర్తుచేసుకున్నప్పుడు మీ ముఖంలో చిరునవ్వు తెచ్చే అందమైన అనుభవాన్ని కూడా పొందుతారు.భారతదేశంలో అనేక రకాల సాహస కార్యకలాపాలు నిర్వహించడానికి అనువైన ప్రదేశాలున్నాయి. పారాగ్లైడింగ్, రాఫ్టింగ్, బంగీ జంపింగ్, స్కూబా డైవింగ్ వంటి సరదా కార్యకలాపాలు నిర్వహించబడతాయి. ఈరోజు మనం భారతదేశంలో బంగీ జంపింగ్ కోసం ఏ ప్రదేశాలను అన్వేషించవచ్చో తెలుసుకుందాం. భారతదేశంలోని ఈ 5 ప్రదేశాలు బంగీ జంపింగ్ కు ఉత్తమమైనవి. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ రిషికేశ్‌లో ఉంది. భారతదేశంలో అనేక రకాల సాహస కార్యకలాపాలు నిర్వహించడానికి అనువైన ప్రదేశాలున్నాయి. పారాగ్లైడింగ్, రాఫ్టింగ్, బంగీ జంపింగ్, స్కూబా డైవింగ్ వంటి సరదా కార్యకలాపాలు నిర్వహించబడతాయి. ఈరోజు మనం భారతదేశంలో బంగీ జంపింగ్ కోసం ఏ ప్రదేశాలను అన్వేషించవచ్చో తెలుసుకుందాం. భారతదేశంలోని ఈ 5 ప్రదేశాలు బంగీ జంపింగ్ కు ఉత్తమమైనవి. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ రిషికేశ్‌లో ఉంది.రిషికేశ్ ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి చెందడమే కాదు మీరు ఇక్కడ అనేక రకాల సాహస కార్యకలాపాలను కూడా చేయవచ్చు. అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే మీరు ఇక్కడ బంగీ జంపింగ్‌ను కూడా ఆస్వాదించవచ్చు. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ ఇక్కడ జరుగుతుంది. దీని ఎత్తు 83 మీటర్లు. రిషికేశ్‌లో, శివపురి , మోహన్ చట్టి వంటి ప్రదేశాలలో బంగీ జంపింగ్ చేస్తారు. రిషికేశ్ ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి చెందడమే కాదు మీరు ఇక్కడ అనేక రకాల సాహస కార్యకలాపాలను కూడా చేయవచ్చు. అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే మీరు ఇక్కడ బంగీ జంపింగ్‌ను కూడా ఆస్వాదించవచ్చు. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ ఇక్కడ జరుగుతుంది. దీని ఎత్తు 83 మీటర్లు. రిషికేశ్‌లో, శివపురి , మోహన్ చట్టి వంటి ప్రదేశాలలో బంగీ జంపింగ్ చేస్తారు.లోనావాలా.. ముంబైలో నివసిస్తున్నా లేదా అక్కడికి వెళ్లాలని ప్లాన్ చేస్తుంటే లోనావాలా పేరు ఖచ్చితంగా మీ పర్యటన జాబితాలో ఉండాలి. ఈ ప్రదేశం ఎంత అందంగా ఉంటుందో అంతే వినోద కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఈ ప్రదేశాన్ని సందర్శించడం ద్వారా మీరు ప్రశాంతతను అనుభవిస్తారు. మీరు ఇక్కడ బంగీ జంపింగ్ కూడా చేయవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ ఎత్తు 28 మీటర్లు. ఇక్కడ మీరు ఈ క్రీడను సురక్షితంగా ఆడేలా చేస్తారు. అందమైన దృశ్యాలను ఆస్వాదిస్తూ మీరు ఇక్కడ బంగీ జంపింగ్ చేయవచ్చు. లోనావాలా.. ముంబైలో నివసిస్తున్నా లేదా అక్కడికి వెళ్లాలని ప్లాన్ చేస్తుంటే లోనావాలా పేరు ఖచ్చితంగా మీ పర్యటన జాబితాలో ఉండాలి. ఈ ప్రదేశం ఎంత అందంగా ఉంటుందో అంతే వినోద కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఈ ప్రదేశాన్ని సందర్శించడం ద్వారా మీరు ప్రశాంతతను అనుభవిస్తారు. మీరు ఇక్కడ బంగీ జంపింగ్ కూడా చేయవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ ఎత్తు 28 మీటర్లు. ఇక్కడ మీరు ఈ క్రీడను సురక్షితంగా ఆడేలా చేస్తారు. అందమైన దృశ్యాలను ఆస్వాదిస్తూ మీరు ఇక్కడ బంగీ జంపింగ్ చేయవచ్చు.గోవాలో బంగీ జంపింగ్: గోవా బీచ్‌లు, పార్టీలకు ప్రసిద్ధి చెందింది. అయితే ఈ ప్రదేశంలో మీరు బంగీ జంపింగ్ కూడా ఆనందించవచ్చని మీకు తెలుసా. ఇక్కడ గ్రావిటీ జోన్‌లో, అంజునా బీచ్‌లో 35 మీటర్ల ఎత్తులో బంగీ జంపింగ్ జరుగుతుంది. దేశ విదేశాల నుంచి ప్రజలు బంగీ జంపింగ్ చేయడానికి ఇక్కడికి వస్తారు. ఈ బీచ్ బంగీ జంపింగ్ కు ప్రసిద్ధి చెందింది. గోవాలో బంగీ జంపింగ్: గోవా బీచ్‌లు, పార్టీలకు ప్రసిద్ధి చెందింది. అయితే ఈ ప్రదేశంలో మీరు బంగీ జంపింగ్ కూడా ఆనందించవచ్చని మీకు తెలుసా. ఇక్కడ గ్రావిటీ జోన్‌లో, అంజునా బీచ్‌లో 35 మీటర్ల ఎత్తులో బంగీ జంపింగ్ జరుగుతుంది. దేశ విదేశాల నుంచి ప్రజలు బంగీ జంపింగ్ చేయడానికి ఇక్కడికి వస్తారు. ఈ బీచ్ బంగీ జంపింగ్ కు ప్రసిద్ధి చెందింది.బెంగళూరులో సరదా బంగీ జంపింగ్: బెంగళూరు ఐటీ హబ్‌గా ప్రసిద్ధి చెందింది. అయితే ఆఫీసు సంస్కృతికి అతీతంగా, ఈ ప్రదేశం సాహస కార్యక్రమాలతో నిండి ఉంది. బంగీ జంపింగ్ కోసం పర్యాటకులు ఎల్లప్పుడూ ఇక్కడికి వస్తారు. ఇక్కడ బంగీ జంపింగ్ 25 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. ఇక్కడ బంగీ జంపింగ్ చేసే సరదా వేరు. బెంగళూరులో సరదా బంగీ జంపింగ్: బెంగళూరు ఐటీ హబ్‌గా ప్రసిద్ధి చెందింది. అయితే ఆఫీసు సంస్కృతికి అతీతంగా, ఈ ప్రదేశం సాహస కార్యక్రమాలతో నిండి ఉంది. బంగీ జంపింగ్ కోసం పర్యాటకులు ఎల్లప్పుడూ ఇక్కడికి వస్తారు. ఇక్కడ బంగీ జంపింగ్ 25 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. ఇక్కడ బంగీ జంపింగ్ చేసే సరదా వేరు.గురుగ్రామ్: గురుగ్రామ్‌లో కూడా బంగీ జంపింగ్ చేయవచ్చని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. గురుగ్రామ్‌లోని బ్యాక్‌యార్డ్ స్పోర్ట్స్ క్లబ్‌లో మీరు బంగీ జంపింగ్‌ను ఆస్వాదించవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ 60 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. గురుగ్రామ్: గురుగ్రామ్‌లో కూడా బంగీ జంపింగ్ చేయవచ్చని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. గురుగ్రామ్‌లోని బ్యాక్‌యార్డ్ స్పోర్ట్స్ క్లబ్‌లో మీరు బంగీ జంపింగ్‌ను ఆస్వాదించవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ 60 మీటర్ల ఎత్తులో జరుగుతుంది.

ఈ టీ మీ ఆరోగ్యానికి సహజ సంజీవని.. ఉదయాన్నే తాగితే ఆ వ్యర్థాలన్నీ బయటకు

'సుగంధ ద్రవ్యాల రాణి'గా పిలవబడే ఏలకులు కేవలం వంటకాలకు రుచిని జోడించడమే కాకుండా, ఆరోగ్యానికి అమృతంలా పనిచేస్తాయి. పురాతన కాలం నుండి సాంప్రదాయ వైద్యంలో ఉపయోగించబడుతున్న ఈ సుగంధ ద్రవ్యం, టీ రూపంలో తీసుకుంటే శరీరాన్ని శుద్ధి చేసి, నోటి ఆరోగ్యం నుండి గుండె, కాలేయం వరకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఏలకుల టీ తయారీ విధానం, దాని అద్భుతమైన ఆరోగ్య లాభాలను తెలుసుకుని, మీ రోజువారీ జీవనంలో ఈ సహజ సంజీవనిని చేర్చుకోండి యాలకులను 'సుగంధ ద్రవ్యాల రాణి'గా పిలుస్తారు. ఇది భారతదేశం, శ్రీలంక మధ్య అమెరికాలో ఎక్కువగా సాగు చేస్తుంటారు. పురాతన కాలం నుండి వంట సాంప్రదాయ వైద్యంలో దీనిని ఉపయోగిస్తున్నారు. ఇది దాల్చిన చెక్క, జాజికాయ, లవంగాలు అల్లం వంటి వేడిని కలిగించే లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తీపి రుచికరమైన వంటకాలకు రుచిని జోడిస్తుంది. అంతేకాదు ఈ కింది ప్రయోజనాలను కూడా చేకూరుస్తుంది.

నోటి ఆరోగ్యానికి వరం

ఏలకుల టీ నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది నోటి దుర్వాసనను తొలగించి, శ్వాసను తాజాగా, సుగంధంగా ఉంచుతుంది. యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలో బ్యాక్టీరియా వృద్ధిని అడ్డుకుంటాయి, దంతాలు, చిగుళ్ల సమస్యలను తగ్గిస్తాయి.

జీర్ణక్రియ సమస్యలకు పరిష్కారం

ఈ టీ జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. అజీర్ణం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలను తగ్గించి, ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. భోజనం తర్వాత ఒక కప్పు టీ తాగితే కడుపు తేలికగా అనిపిస్తుంది.

శరీర శుద్ధి, రోగనిరోధక శక్తి

ఏలకుల్లోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రించి, కణాల నష్టాన్ని తగ్గిస్తాయి. ఈ టీ శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్‌ను తొలగించి, కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచి, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి.

బరువు నియంత్రణ, గుండె ఆరోగ్యం

ఏలకుల టీ జీవక్రియను వేగవంతం చేసి, శరీరంలోని అదనపు కొవ్వును కరిగిస్తుంది, బరువు నియంత్రణకు సహాయపడుతుంది. అధిక పొటాషియం కంటెంట్ రక్తపోటును తగ్గించి, రక్తనాళాల ఒత్తిడిని నియంత్రిస్తుంది. రోజూ ఒక కప్పు టీ తాగడం హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

మానసిక ప్రశాంతతకు సహాయం

ఏలకుల టీ మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. ఒత్తిడి, ఆందోళనతో బాధపడేవారికి ఇది సహజ ఉపశమనం అందిస్తుంది. హార్మోన్ల సమతుల్యతను కాపాడి, మానసిక సంతోషాన్ని పెంచుతుంది.

జాగ్రత్తలుజి

ఏలకులు వేడి స్వభావం కలిగి ఉంటాయి కాబట్టి, అతిగా తీసుకోవడం వల్ల అసౌకర్యం కలగవచ్చు.

గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు వైద్య సలహా తీసుకోవాలి.

అలెర్జీలు ఉన్నవారు తక్కువ మోతాదుతో ప్రారంభించి, శరీర స్పందనను పరిశీలించాలి.

పెళ్లిళ్ల స్పెషల్ నోరూరించే గుమ్మడి వడియాలు.. రుచిగా పెట్టే సులభమైన విధానం!

ఎండాకాలం వచ్చిందంటే చాలు, ప్రతి తెలుగు ఇంటి వాకిలిలోనూ కనిపించే ఒక ప్రత్యేకమైన దృశ్యం గుమ్మడి వడియాలు. బంగారు వర్ణంలో మెరిసే ఈ చిన్న చిన్న ముక్కలు కేవలం రుచికరమైనవే కాదు, మన సంస్కృతిలో ఒక భాగం కూడా. మరి ఈ గుమ్మడి వడియాలను ఈజీగా పక్కా కొలతలతో ఎలా పెట్టుకోవాలి... తయారీ విధానం వంటివి చదివేయండి.. గుమ్మడి వడియాలంటే ఇష్టపడని వారుండరు. ఎండాకాలంలో చేసుకునే నిల్వ ఆహారాల్లో వీటని కచ్చితంగా చేర్చుతుంటారు. ఈ వడియాలను కూరల్లో, పులుసుల్లో వేసుకుంటే ప్రత్యేకమైన రుచి వస్తుంది. మరి, గుమ్మడి వడియాలు టేస్టీగా ఎలా పెట్టాలో తెలుసుకుందాం రండి.

కావలసిన పదార్థాలు:

గుమ్మడికాయ 1 (సుమారు 1 కిలో) బియ్యప్పిండి 1 కప్పు (లేదా మీ గుమ్మడి తురుము యొక్క పరిమాణానికి తగినంత) పచ్చిమిర్చి 2-3 (మీ రుచికి తగినట్లు) అల్లం చిన్న ముక్క (ఒక ఇంచు) జీలకర్ర 1 టీస్పూన్ ఉప్పు రుచికి తగినంత నూనె వడియాలు పెట్టడానికి (ఆప్షనల్)

తయారీ విధానం:

ముందుగా గుమ్మడికాయను శుభ్రంగా కడిగి, దాని తొక్క తీసేయాలి. లోపలి గింజలు, మెత్తటి గుజ్జును పూర్తిగా తొలగించాలి. గుమ్మడికాయను తురుము పీటతో పలుకుగా తురుముకోవాలి. మరీ మెత్తగా కాకుండా కొంచెం బరకగా ఉంటే వడియాలు రుచిగా ఉంటాయి. తురిమిన గుమ్మడి తురుమును ఒక పలుచని కాటన్ గుడ్డలో వేసి గట్టిగా పిండి నీరంతా తీసివేయాలి. ఇది చాలా ముఖ్యమైన దశ. నీరు ఉంటే వడియాలు సరిగ్గా ఎండవు మరియు పాడైపోయే అవకాశం ఉంది.ఒక పెద్ద గిన్నెలో పిండిన గుమ్మడి తురుము వేయాలి. అందులో బియ్యప్పిండి, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, తురిమిన అల్లం, జీలకర్ర రుచికి తగినంత ఉప్పు వేయాలి. ఈ పదార్థాలన్నింటినీ బాగా కలపాలి. పిండి గుమ్మడి తురుముతో కలిసి ముద్దలాగా రావాలి. అవసరమైతే కొద్దిగా బియ్యప్పిండిని కలుపుకోవచ్చు, కానీ మరీ ఎక్కువ పిండి వేయడం వల్ల గుమ్మడి రుచి తగ్గిపోతుంది.

వడియాలకు ప్రిపరేషన్:

ఒక ప్లాస్టిక్ షీట్ లేదా శుభ్రమైన కాటన్ గుడ్డను ఎండలో వేయాలి. మీ చేతులకు కొద్దిగా నూనె రాసుకొని (లేదా నూనె లేకుండానే), తయారుచేసిన మిశ్రమం నుండి చిన్న చిన్న ఉండలుగా తీసుకుని వడియాల ఆకారంలో ఒత్తుకోవాలి. మీకు నచ్చిన ఆకారంలో (చిన్నవి లేదా పెద్దవి) పెట్టుకోవచ్చు. కొందరు గుండ్రంగా పెడతారు, మరికొందరు కొంచెం పొడవుగా పెడతారు. పెట్టిన వడియాలను నేరుగా ఎండలో 2-3 రోజుల పాటు బాగా ఎండబెట్టాలి. ప్రతిరోజూ ఒకసారి వాటిని తిప్పుతూ ఉండాలి, అప్పుడే అన్ని వైపులా సమానంగా ఎండిపోతాయి. వడియాలు గట్టిగా, పూర్తిగా పొడిబారే వరకు ఎండబెట్టాలి. వడియాలు పూర్తిగా ఎండిపోయిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో లేదా కవర్లో నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ చేసుకుంటే చాలా కాలం పాటు తాజాగా ఉంటాయి.

రుచి కోసం మరికొన్ని చిట్కాలు:

మీరు కావాలంటే కొద్దిగా ఇంగువ కూడా కలపవచ్చు. ఇది వడియాలకు మంచి సువాసనను ఇస్తుంది.

కొంతమంది కొత్తిమీర లేదా కరివేపాకు కూడా సన్నగా తరిగి కలుపుతారు.

పచ్చిమిర్చికి బదులుగా కొద్దిగా కారం కూడా వేసుకోవచ్చు.

ఇలా చేస్తే మీ గుమ్మడి వడియాలు చాలా రుచిగా వస్తాయి. వీటిని వేయించుకొని నేరుగా తినవచ్చు లేదా కూరల్లో, పులుసుల్లో వేసుకొని ఆస్వాదించవచ్చు.

ఈ సమయంలో గోళ్లు కత్తిరిస్తున్నారా..? అయితే ఇది మీకోసమే..!

మన ఇంట్లో పెద్దవాళ్లు తరచూ చెప్పే మాట.. రాత్రిపూట గోళ్లు కత్తిరించవద్దని.. ఇది ఒక సాధారణ సూచనలా అనిపించినా.. దీని వెనుక ఉన్న కారణాలు శాస్త్రం, ఆరోగ్యం, సంప్రదాయ విశ్వాసాలతో చాలా అనుబంధం కలిగి ఉంటాయి. ఈ అలవాటు ఎందుకు వచ్చిందో అర్థం చేసుకోవాలి. పురాతన నమ్మకాల ప్రకారం రాత్రిపూట కొన్ని చెడు శక్తులు ఎక్కువగా తిరుగుతాయట. ఆ సమయంలో గోళ్లు కత్తిరిస్తే ఆ శక్తులు మనకు కష్టాలు కలిగిస్తాయని అనుకునేవారు. కొందరు రాత్రిపూట చంద్రుడి శక్తి చాలా ఎక్కువగా ఉంటుందని నమ్ముతారు. గోళ్లు తీసేస్తే ఆ శక్తి తగ్గిపోతుందని కూడా భావించేవారు. శాస్త్రంలో కూడా రాత్రిపూట గోళ్లు కత్తిరించడం వల్ల శరీరం సమతుల్యత దెబ్బతింటుందని చెబుతారు. విద్యుత్ అందుబాటులో లేని రోజులలో రాత్రిపూట వెలుతురు చాలా తక్కువగా ఉండేది. అప్పుడు దీపాల వెలుతురులో గోళ్లు కత్తిరించడం ప్రమాదకరం. ఒక్కసారి తప్పుగా కత్తిరిస్తే వేళ్లకు గాయం అయ్యే అవకాశం ఉండేది. అందుకే రాత్రిపూట గోళ్లు కత్తిరించకూడదని చెప్పారు. ఇది పూర్తిగా భద్రతతో సంబంధం ఉన్న విషయం. సాయంత్రం అయ్యాక మన శరీరం నిద్రపోవడానికి తయారవుతుంది. రోజంతా పని చేసి అలిసిపోయిన శరీరం అప్పుడు రెస్ట్ తీసుకోవాలనుకుంటుంది. అలాంటి టైమ్‌లో పదునైన వస్తువులు పట్టుకోవడం, జాగ్రత్తగా చేయాల్సిన పనులు చేయడం మంచిది కాదు. గోళ్లు కత్తిరించడం అంటే చాలా శ్రద్ధగా చేయాల్సిన పని. అలసటగా ఉన్నప్పుడు సరిగ్గా చేయకపోతే ప్రమాదం జరిగే ఛాన్స్ ఉంది. గోళ్లు కత్తిరించినప్పుడు చిన్న చిన్న ముక్కలు కింద పడతాయి. వాటికి బ్యాక్టీరియా లేదా దుమ్ము అంటుకుని ఉండొచ్చు. పగటిపూట లైట్ లో అవి బాగా కనిపిస్తాయి కాబట్టి వాటిని తీసి పారేయొచ్చు. కానీ రాత్రిపూట మంచం మీద కూర్చొని గోళ్లు కత్తిరిస్తే అవి అక్కడే పడిపోతాయి. పొరపాటున అవి మనం తినే ఆహారంలో కలిసిపోయే ఛాన్స్ ఉంది. అలా జరిగితే ఆరోగ్యం పాడవుతుంది. అంతేకాదు ఆ గోళ్ల ముక్కలకు చీమలు, చిన్న పురుగులు కూడా వస్తాయి. రాత్రిపూట గోళ్లు కత్తిరించకూడదనే సలహా కేవలం మూఢనమ్మకం కాదు. దీనివెనుక భద్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, శారీరక స్థితి అన్నీ మిళితమై ఉన్నాయి. పగటిపూట వెలుతురులో గోళు కత్తిరించడం వల్ల గాయాల ప్రమాదం తగ్గుతుంది. అదనంగా పరిశుభ్రంగా ఉండే అవకాశం కూడా ఎక్కువ. నేలపై కాగితం లేదా బట్టను పరచి ఆపై కత్తిరిస్తే గోళ్లు ఒక్కచోటే చేరుతాయి. మన పెద్దల సూచనను నిర్లక్ష్యం చేయకుండా వెలుతురు ఉన్న సమయంలో గోళ్లు కత్తిరించటం మంచి అలవాటు.

జుట్టు రాలడం ఆగాలంటే ఈ నీళ్లు తాగాల్సిందే..! ఇది మంచి టానిక్ లా పని చేస్తుంది..!

ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా మెరిసే జుట్టు కావాలని ఉంటుంది. ఈ రోజుల్లో జుట్టు రాలడం, పెరగకపోవడం, బలహీనత వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సహజమైన మునగ ఆకుల నీరు బాగా ఉపయోగపడుతుంది. దీన్ని తాగడం వల్ల జుట్టు బలంగా మారుతుంది. మునగ ఆకులు విటమిన్ %ూ, జ, జు, ద% లను అందిస్తాయి. ఇందులో ఐరన్, జింక్, అమైనో ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి అన్ని కలిసి జుట్టు మూలాలను బలంగా మార్చడంలో సహాయపడతాయి. ఆకులలో ఉండే పోషకాలు జుట్టు ఎదుగుదలకు అవసరమైన సహజ మార్గం అందిస్తాయి. మునగ గింజలు కూడా శక్తివంతంగా పనిచేస్తాయి. మునగ ఆకుల నీటిని తాగడం వల్ల శరీరానికి శక్తి వస్తుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. తల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు బలంగా, మెత్తగా, ప్రకాశవంతంగా మారుతుంది. తలలో కొత్త జుట్టు మొదలవుతుంది. ఇది సాధారణంగా రసాయనాలు వాడకుండా చక్కగా పెరిగే సహజ మార్గం. గుప్పెడు తాజా మునగ ఆకులను తీసుకొని శుభ్రంగా కడగాలి. వీటిలో ఉండే మురికి తొలగించాలి. తరువాత రెండు కప్పుల నీటిని మరిగించాలి. నీరు మరిగిన తర్వాత అందులో ఆకులను వేసి 10 నిమిషాలు ఇంకా మరిగించాలి. తరువాత వడకట్టి నీరు చల్లార్చి తాగాలి. దీనిని ఖాళీ కడుపుతో తీసుకుంటే బాగా పని చేస్తుంది. మునగకాయలను చిన్న ముక్కలుగా రెండు కట్ చేసుకోవాలి. ఇప్పుడు రెండు కప్పుల నీటిని మరిగించి అందులో ఈ ముక్కలు వేసి 10 నిమిషాలు మరిగించాలి. తరువాత వడకట్టి చల్లబర్చాలి తాగాలి. ఉదయం ఖాళీ కడుపుతో తాగాలి. ఒక కప్పుతో మొదలుపెట్టి, క్రమంగా రెండు కప్పుల వరకు తీసుకోవచ్చు. రుచి సరిగా అనిపించకపోతే తేనె లేదా నిమ్మరసం కొద్దిగా వేసుకోవచ్చు. దీన్ని వారంలో మూడుసార్లు తాగినా సరిపోతుంది. క్రమంగా రెండు నెలలు తాగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మునగ నీటిని తాగడమే కాకుండా.. తల కడుక్కోవడానికి కూడా వాడొచ్చు. తలపై ఈ నీటిని పోస్తే తల చర్మం చల్లగా ఉంటుంది. దీంతో తలలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. జుట్టు బలంగా మారుతుంది. మునగ నీటిలో విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలో ఉన్న విషాలను బయటకు పంపుతుంది. చర్మానికి మెరుపు తీసుకువస్తుంది. జుట్టు ఎదుగుదల క్రమంగా మెరుగవుతుంది.

ఇంట్లోనే తక్కువ ఖర్చుతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టొచ్చు..!

అరటి పండు తిన్నాక మిగిలే తొక్కను చాలా మంది వ్యర్థంగా వదిలేస్తారు. కానీ అది జుట్టు సంరక్షణలో అద్భుత ఫలితాలు ఇస్తుంది. సహజంగా దొరికే ఈ తొక్కను సరైన రీతిలో వాడితే జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. తల చర్మానికి పోషణ ఇస్తూ కొత్త జుట్టు పెరగడంలో సహాయపడుతుంది. అరటి పండు తిన్నాక మిగిలిపోయే తొక్కను చాలా మంది విసిరేస్తారు. కానీ అదే తొక్క జుట్టుకు అద్భుతంగా పనిచేస్తుంది. సరైన రీతిలో వాడితే ఇది జుట్టు రాలడాన్ని తగ్గించటమే కాకుండా కొత్త జుట్టు పెరగడంలో సహాయపడుతుంది. ఆరోగ్యంగా జుట్టు పెరగాలంటే దీన్ని ఉపయోగించడం మంచిది.

అరటి తొక్కలో చాలా పోషకాలు

పొటాషియం.. ఇది తలపై తేమను నిలుపుతుంది. తల చర్మం పొడి కాకుండా ఉండేలా చూస్తుంది.

మెగ్నీషియం.. ఇది తల చర్మంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది.

విటమిన్ ఇవి జుట్టు ఫోలికల్స్ కు బలం ఇస్తాయి.

ఇవి జుట్టు రాలే సమస్య తగ్గించడంలో సహాయపడతాయి.

హెయిర్ మాస్క్

పండిన అరటి తొక్క 1, కొబ్బరి నూనె 1 టీస్పూన్, తేనె 1 టీస్పూన్. ఈ మూడు పదార్థాలను బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి 30 నిమిషాలు ఉంచాలి. తర్వాత తల శుభ్రంగా కడగాలి. ఇది తలకు పోషణ అందించి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

అరటి తొక్క వాటర్ వాష్

అరటి తొక్క 1, నీరు 2 కప్పులు. అరటి తొక్కను నీటిలో 10 నిమిషాలు మరిగించాలి. చల్లారిన తర్వాత ద్రవాన్ని వడకట్టాలి. ఈ నీటిని చల్లార్చి తల కడిగిన తర్వాత చివరిగా తలపై పోయాలి. ఇది తల చర్మాన్ని తేమగా ఉంచుతుంది. జుట్టు మెత్తగా మారుతుంది.

అరటి తొక్కతో ఆయిల్

అరటి తొక్క 1, కొబ్బరి లేదా ఆలివ్ నూనె అర కప్పు. ఒక చిన్న పాత్రలో నూనె వేడి చేయాలి. అందులో తొక్క వేసి 10 నిమిషాలు మరిగించాలి. మరిగిన తరువాత వడకట్టి ఒక సీసాలో నిల్వ చేయాలి. ఈ నూనెను తలకు అప్లై చేసి అరగంట తర్వాత తల కడిగితే జుట్టు కాంతివంతంగా మారుతుంది. మీ తల చర్మం సున్నితంగా ఉంటే.. ఈ నూనెను మొదట కొద్దిగా పరీక్షించి చూడటం మంచిది. ఈ నూనెను ఉపయోగించే ముందు చల్లబరచాలి. సాధారణంగా వారానికి ఒక్కసారి ఈ నూనెను వాడితే సరిపోతుంది. అంతకంటే ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం లేదు. కేవలం అరటి తొక్కతో ఇంట్లోనే తక్కువ ఖర్చుతో జుట్టు సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. దీనిలో రసాయనాలు లేవు, సైడ్ ఎఫెక్టు కూడా ఉండవు. కొద్దికాలం పాటు క్రమంగా వాడితే జుట్టులో మంచి మార్పు కనిపిస్తుంది. ఈ పదార్థాలు సహజమైనవే అయినా..

కొత్త రూల్స్ సిలిండర్లలో మారిన ఈ నియమాలు మీకు తెలుసా?

మనం ప్రతిరోజూ వాడే మొబైల్ పేమెంట్లు

ఇంట్లో వాడే గ్యాస్ సిలిండర్విషయంలో జూన్ 1 నుంచి కొన్ని కీలక మార్పులు వచ్చాయి. ఈ కొత్త నిబంధనలు మన రోజువారీ ఖర్చులు, ఆర్థిక లావాదేవీలపై గట్టి ప్రభావం చూపించనున్నాయి. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తడంతో, దేశంలో గ్యాస్ ధరల తో పాటు పెట్రోల్, డీజిల్, సీఎన్జీ ధరలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, బ్యాంకులు తీసుకొచ్చిన ఆ కొత్త రూల్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.యూపీఐ లో భారీ మార్పులు..ఆన్లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరికొత్త సెక్యూరిటీ రూల్స్ తీసుకొచ్చింది. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం లాంటి యాప్స్ ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు పంపేటప్పుడు ఇకపై కేవలం 4 లేదా 6 అంకెల పిన్ నెంబర్ నొక్కితే సరిపోదు.బయోమెట్రిక్ వెరిఫికేషన్: పెద్ద మొత్తంలో లావాదేవీలు చేసేటప్పుడు కచ్చితంగా మీ ఫేస్ ఐడీ లేదా ఫింగర్ప్రింట్ (దీఅశీఎవ్తీఅఎ) వెరిఫై చేయాల్సి ఉంటుంది.పేరు చూపిస్తుంది: పొరపాటున వేరే వాళ్లకు డబ్బులు పంపకుండా ఉండటానికి, మీరు స్కాన్ చేయగానే సదరు వ్యక్తి ఒరిజినల్ అఫీషియల్ పేరు స్క్రీన్పై స్పష్టంగా కనిపిస్తుంది.ఏటీఎం విత్డ్రా లిమిట్: కార్డు లేకుండా యూపీఐ ద్వారా ఏటీఎం నుండి డబ్బులు తీస్తే, వాటిని కూడా మీ నెలవారీ ఉచిత విత్డ్రాయల్స్ లిమిట్ కిందే లెక్కిస్తారు. లిమిట్ దాటితే ఛార్జీలు పడతాయి.**గ్యాస్ సిలిండర్ కొత్త రూల్స్ ఇవే!**ప్రభుత్వం ఇప్పుడు ఎల్పీజీ సిలిండర్ల నుండి పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ల వైపు జనాలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా కొన్ని కఠినమైన నిబంధనలు అమలులోకి వచ్చాయి.పీఎన్జీ కనెక్షన్ రూల్: మీకు కొత్తగా పీఎన్జీ కనెక్షన్ వస్తే, కేవలం 30 రోజుల్లోగా మీ పాత ఎల్పీజీ కనెక్షన్ను రద్దు చేసుకోవాలి. ఒకే ఇంట్లో పీఎన్జీ, ఎల్పీజీ రెండు ఉంచుకోవడం కుదరదు.కొత్త బుకింగ్స్పై నిషేధం: ఇప్పటికే ఇంట్లో పీఎన్జీ వాడుతున్న వారు, కొత్తగా ఎల్పీజీ కనెక్షన్ తీసుకోవడానికి వీల్లేదు.సిలిండర్ బుకింగ్ గ్యాప్: గ్యాస్ సిలిండర్ రీఫిల్ బుక్ చేయడానికి ఒక ఆర్డర్కు, మరో ఆర్డర్కు మధ్య ఉండాల్సిన సమయాన్ని మార్చారు. పట్టణాల్లో ఈ గ్యాప్ 25 రోజులు, పల్లెటూళ్లలో 45 రోజులుగా నిర్ణయించారు.ఒక ఇంటికి ఒకే కనెక్షన్: ఒకే ఇంట్లో ఎక్కువ సిలిండర్లు దాచిపెట్టకుండా ఉండటానికి "వన్ హౌస్.. వన్ కనెక్షన్" రూల్ను కఠినంగా అమలు చేస్తున్నారు.**జూన్ 1 నుంచే ఎందుకు?**సాధారణంగా మే 31 నాటికి సాంకేతిక మార్పుల గడువు ముగుస్తుంది. అలాగే జూన్ నెలలో స్కూల్ ఫీజులు, సమ్మర్ హాలిడేస్ ప్రయాణాల వల్ల ఆన్లైన్ ట్రాన్సాక్షన్స్ విపరీతంగా పెరుగుతాయి. అందుకే ఎలాంటి ఇబ్బందులు రాకుండా జూన్ 1 నుంచే ఈ కొత్త సెక్యూరిటీ సిస్టమ్స్ అమల్లోకి తెచ్చారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో గ్యాస్ ధరలు పెరుగుతున్న వేళ, ఈ రూల్స్ తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం.

కాల్పుల విరమణపై ఇరాన్ కీలక నిర్ణయం

ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించిన టెహ్రాన్..అమెరికా యుద్ధ విమానం కూల్చివేత

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. అమెరికా - ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు విఫలం కావడమే కాకుండా, క్షేత్రస్థాయిలో సైనిక ఘర్షణలు మొదలైనట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం.. ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దేందుకు అమెరికా ప్రతిపాదించిన 48 గంటల కాల్పుల విరమణను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.అమెరికా తన ప్రతిపాదనను ఒక అజ్ఞాత మూడవ దేశం ద్వారా బుధవారం నాడు ఇరాన్కు పంపినట్లు సమాచారం. అయితే, టెహ్రాన్ ఈ ప్రతిపాదనను తిరస్కరించడం ద్వారా తన పట్టుదలను ప్రదర్శించింది. ఇరాన్ యొక్క పాక్షిక అధికారిక సంస్థ 'ఫార్స్ న్యూస్' ఈ విషయాన్ని ధృవీకరించగా.. అల్ జజీరా వంటి అంతర్జాతీయ సంస్థలు దీనిని ప్రముఖంగా ప్రచురించాయి. మధ్యవర్తిత్వం వహించిన దేశం పేరు బయటకు రానప్పటికీ, చర్చల ద్వారా శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు ప్రస్తుతానికి నిలిచిపోయాయని స్పష్టమవుతోంది.ఈ ఉద్రిక్తతల నడుమ ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఇరాన్ గగనతలంపై అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్ కూల్చివేయబడింది. బ్రిటన్లోని ఆర్ఏఎఫ్ లేకెన్హీత్ స్థావరానికి చెందిన ఈ విమానాన్ని ఇరాన్ దళాలు కూల్చివేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ రకమైన విమానంలో సాధారణంగా ఇద్దరు సిబ్బంది (పైలట్, ఆయుధ వ్యవస్థల అధికారి) ఉంటారు.ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..సిఎన్ఎన్ నివేదిక ప్రకారం.. కూలిపోయిన విమానంలోని ఒక సిబ్బంది సభ్యుడిని అమెరికా సైన్యం సురక్షితంగా రక్షించింది. ప్రస్తుతం అతను అమెరికా రక్షణలో చికిత్స పొందుతున్నాడు. అయితే, రెండో సిబ్బంది సభ్యుడి పరిస్థితిపై ఇంకా స్పష్టత రాలేదు. టెహ్రాన్ నుండి సుమారు 470 కిలోమీటర్ల

దూరంలో ఉన్న ఖుజెస్తాన్ ప్రావిన్స్లోని కరూన్ నది సమీపంలో ఈ విమానం కూలిపోయింది. ఇరాన్ మీడియా ఈ ఘటనకు సంబంధించిన శకలాల ఫోటోలను, వీడియోలను విడుదల చేసింది. అందులో హెలికాప్టర్లు తక్కువ ఎత్తులో ఎగురుతూ గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.ఈ ఘటనపై అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) లేదా వైట్ హౌస్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇరాన్ గగనతలంపై ఒక అమెరికా యుద్ధ విమానం కూల్చివేయబడటం ఇదే మొదటిసారి అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య నేరుగా యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది. ఒకవైపు చమురు ధరలు పెరుగుతుండటం, మరోవైపు ఇలాంటి సైనిక ఘర్షణలు చోటుచేసుకోవడం ప్రపంచ మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి. ఏప్రిల్ నెల గడిచే కొద్దీ ఈ ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయోనన్న భయం పెట్టుబడిదారులలో వ్యక్తమవుతోంది.

కొత్త లేబర్ కోడ్స్.. గ్రాట్యుటీ అర్హతలో భారీ మార్పులు

5 ఏళ్లకు బదులుగా ఏడాదికే

భారతదేశంలో కార్మిక సంక్షేమ దిశగా ప్రభుత్వం ఒక చారిత్రాత్మక అడుగు వేసింది. నవంబర్ 2025లో అమలులోకి వచ్చిన కొత్త కార్మిక చట్టాలు గ్రాట్యుటీ నిబంధనలలో సమూల మార్పులను తీసుకువచ్చాయి. గతంలో ఒక ఉద్యోగి గ్రాట్యుటీ పొందాలంటే కనీసం ఐదేళ్ల నిరంతర సేవ తప్పనిసరిగా ఉండాలి అనే నిబంధన ఉండేది, కానీ కొత్త మార్పుల ప్రకారం ఇప్పుడు కేవలం ఒక సంవత్సరం తర్వాతే ఈ ప్రయోజనాన్ని పొందే అవకాశం కలిగింది.సాధారణంగా గ్రాట్యుటీ అనేది ఒక ఉద్యోగి ఒక సంస్థకు అందించిన దీర్ఘకాలిక సేవలకు గుర్తింపుగా, పదవీ విరమణ సమయంలో లేదా ఉద్యోగం వదిలివేసేటప్పుడు యజమాని ఇచ్చే ఆర్థిక బహుమతి. చట్టం ప్రకారం, పది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులున్న ప్రతి సంస్థ తన అర్హులైన ఉద్యోగులకు ఈ మొత్తాన్ని చెల్లించడం తప్పనిసరి.ఈ కొత్త నిబంధనలు నవంబర్ 21, 2025 నుండి అధికారికంగా అమలులోకి వచ్చాయి. ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టం చేసిన ప్రకారం, ఈ తేదీ తర్వాత కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగులకు మాత్రమే ఒక సంవత్సరం నిబంధన వర్తిస్తుంది. అయితే, ఈ ఒక సంవత్సరం గ్రాట్యుటీ సౌకర్యం ఉద్యోగులందరికీ ఒకేలా వర్తించదు. ప్రధానంగా నిర్ణీత కాలం పని చేసేవారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఈ మార్పు పెద్ద ఊరటనిస్తుంది.ఒక రాతపూర్వక ఒప్పందం ప్రకారం నిర్దిష్ట కాలం పాటు పనిచేసే వీరికి, వారు పనిచేసిన కాలానికి అనుగుణంగా అంటే దామాషా పద్ధతిలో గ్రాట్యుటీని లెక్కిస్తారు. కానీ, రెగ్యులర్ లేదా శాశ్వత ఉద్యోగులు గ్రాట్యుటీ క్లెయిమ్ చేయాలంటే ఇప్పటికీ సాధారణంగా ఐదేళ్ల సేవ పూర్తి చేయాల్సి ఉంటుంది. కేవలం ఉద్యోగి మరణించినా లేదా వైకల్యానికి గురైనా మాత్రమే ఈ ఐదేళ్ల నిబంధన నుండి మినహాయింపు ఉంటుంది. గ్రాట్యుటీ రూల్స్లో బిగ్ చేంజ్.. ఏడాది సర్వీస్కే డబ్బులు.. కానీ, ఆ కండిషన్ తప్పనిసరి! గ్రాట్యుటీ రూల్స్లో బిగ్ చేంజ్.. ఏడాది సర్వీస్కే డబ్బులు.. కానీ, ఆ కండిషన్ తప్పనిసరి!గ్రాట్యుటీ లెక్కింపు విధానంలో కూడా ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. కొత్త చట్టం ప్రకారం.. గ్రాట్యుటీ అనేది ఉద్యోగి యొక్క 'వేతనం'పై ఆధారపడి ఉంటుంది. ఇక్కడ వేతనం అంటే కేవలం బేసిక్ పే మాత్రమే కాకుండా, మూల వేతనం, కరువు భత్యం , రిటైనింగ్ అలవెన్స్ల కలయికగా పరిగణిస్తారు. ముఖ్యంగా, ఒక ఉద్యోగి యొక్క మొత్తం జీతం లో ఈ వేతనం కనీసం 50 శాతం ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.దీనివల్ల గతంలో తక్కువ బేసిక్ పే ఉండి, ఇతర భత్యాలు ఎక్కువగా పొందిన ఉద్యోగులకు ఇప్పుడు అందే మొత్తం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ సంస్కరణలు లక్షలాది మంది అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతను కల్పించడమే కాకుండా, వారి పదవీ విరమణానంతర జీవితానికి ఆర్థిక భరోసానిస్తాయి.

భారత్ ఒక ఏడాది పాటు బంగారం కొనడం ఆపేస్తే ఏం జరుగుతుంది

కేంద్రం అసలు ప్లాన్ ఇదే! మన భారతీయులకు బంగారం అంటే కేవలం ఒక లోహం మాత్రమే కాదు, అది ఒక సెంటిమెంట్. పెళ్లిళ్లయినా, పండుగలైనా బంగారం కొననిదే మనకు ముచ్చట తీరదు. అయితే, ఒకవేళ భారత్ ఒక సంవత్సరం పాటు విదేశాల నుంచి బంగారం దిగుమతి చేసుకోవడం పూర్తిగా ఆపేస్తే ఏం జరుగుతుందో ఎప్పుడైనా ఆలోచించారా? దీనివల్ల ప్రపంచ మార్కెట్ నుంచి మన ఇంటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రపంచ మార్కెట్లో పసిడి ధరల పతనం? భారత్ ఏటా దాదాపు 800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటుంది. అంటే ప్రపంచంలోనే అతిపెద్ద కొనుగోలుదారులలో మనం ఒకరం. ఒక్కసారిగా భారత్ నుంచి డిమాండ్ తగ్గిపోతే, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు దారుణంగా పడిపోయే అవకాశం ఉంది. మార్కెట్లో బంగారం ఎక్కువగా ఉండి, కొనేవారు తక్కువగా ఉండటం వల్ల గ్లోబల్ ప్రైసెస్ కరెక్షన్ కి గురవుతాయి. కానీ విచిత్రం ఏమిటంటే, ప్రపంచ మార్కెట్లో ధరలు తగ్గినా, మన దేశంలో మాత్రం లభ్యత తక్కువగా ఉండటం వల్ల ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. మన ఆర్థిక వ్యవస్థకు లాభమా? నష్టమా? బంగారం అనేది పెట్రోల్ తర్వాత భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకునే రెండో వస్తువు. దీని కోసం మనం ఏటా దాదాపు వి60 నుంచి వి70 బిలియన్ల విదేశీ కరెన్సీని ఖర్చు చేస్తున్నాం. ఒకవేళ ఈ కొనుగోళ్లు ఆపితే, ఆ డాలర్లన్నీ ఆదా అవుతాయి. దీనివల్ల మన రూపాయి విలువ పెరగడమే కాకుండా, కరెంట్ అకౌంట్ డెఫిసిట్ తగ్గుతుంది. ఆ మిగిలిన సొమ్మును క్రూడ్ ఆయిల్ వంటి అత్యవసర వనరుల కోసం ప్రభుత్వం వాడుకోవచ్చు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక రకంగా మేలు చేస్తుంది. పరిశ్రమపై ప్రతికూల ప్రభావం మరోవైపు, ఈ నిర్ణయం వల్ల 'జెమ్స్ అండ్ జ్యువెలరీ' రంగం తీవ్రంగా దెబ్బతింటుంది. మన దేశంలో ఈ రంగంపై దాదాపు ఒక కోటి మందికి పైగా కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. బంగారం అమ్మకాలు నిలిచిపోతే, వారందరూ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే మార్కెట్లో ఈ వార్తల వల్ల జ్యువెలరీ కంపెనీల షేర్లు పతనం అవుతున్నాయి. పైగా, ప్రభుత్వం చట్టపరంగా బంగారంపై ఆంక్షలు విధిస్తే.. స్మగ్లింగ్ పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే మన దేశంలో పెళ్లిళ్ల సీజన్లో బంగారం అవసరం కచ్చితంగా ఉంటుంది, కాబట్టి ప్రజలు దొంగచాటుగానైనా కొనడానికి ప్రయత్నిస్తారు. ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే! ప్రజలు భౌతికంగా బంగారాన్ని కొని దాచుకోవడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్దగా ఉపయోగం ఉండదు. అందుకే ప్రభుత్వం గోల్డ్ ఈటీఎఫ్లు , సావరిన్ గోల్డ్ బాండ్ల వైపు ప్రజలను మళ్లించే ప్రయత్నం చేస్తోంది. దీనివల్ల మీకు బంగారం ధర పెరిగినప్పుడల్లా లాభం వస్తుంది, కానీ దిగుమతి చేసుకునే అవసరం ఉండదు. మరోవైపు, సామాన్యులను కొనొద్దని చెబుతున్నా.. దేశ ఆర్థిక భద్రత కోసం ఆర్బీఐ మాత్రం తన వద్ద రికార్డు స్థాయిలో 880 టన్నుల బంగారాన్ని నిల్వ ఉంచుతోంది. మొత్తానికి, భారత్ బంగారం కొనడం ఆపేస్తే ఆర్థికంగా డాలర్లు ఆదా అవ్వొచ్చు కానీ, సామాజికంగా , ఉపాధి పరంగా భారీ ఇబ్బందులు తప్పవు. బంగారం అనేది మన సంస్కృతిలో భాగం కాబట్టి, డిమాండ్ అనేది ఎప్పటికీ తగ్గకపోవచ్చు.

బెంగళూరులో బతకాలంటే నెలకి రూ. రూ. 1.3 లక్షలు కావాలి

కుటుంబం ఖర్చుపై సోషల్ మీడియాలో హాట్ డిబేట్.. బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో పెరుగుతున్న జీవన వ్యయం పై ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చకు దారి తీస్తోంది. రాధిక, ఏకాంశ్ అనే జంట పంచుకున్న వివరాలు ఒక ప్రధాన ఉదాహరణగా నిలిచాయి. పూర్తిస్థాయి ఉద్యోగాలతో పాటు కంటెంట్ క్రియేటర్లుగా రాణిస్తున్న ఈ జంట, విహారయాత్రలు లేదా విలాసవంతమైన ఖర్చులు కాకుండా కేవలం ప్రాథమిక జీవనశైలి కోసమే ప్రతి నెలా సుమారు రూ. 1.3 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భారతదేశపు ఐటీ రాజధానిలో మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వర్గాల ఆర్థిక స్థితిగతులను ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ దంపతుల బడ్జెట్లో సింహభాగం ఇంటి అద్దెకే వెళ్తోంది. నెలకు రూ. 56,000 అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపిన వారు, ఈ మొత్తాన్ని 'రెండవ ఈఎంఐ'తో పోల్చడం గమనార్హం. ఐటీ నిపుణులు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయనే వాస్తవానికి ఇది నిదర్శనం. ఉద్యోగ బాధ్యతల వల్ల ఇంటి పనుల కోసం వారు మరో రూ. 10,000 కేటాయిస్తున్నారు. ఇక నిత్యావసరాలైన కిరాణా సామాగ్రికి రూ. 15,000, విద్యుత్, ఇంటర్నెట్ వంటి యుటిలిటీ సేవల కోసం మరో రూ. 15,000 ఖర్చవుతోంది. రవాణా ఖర్చులు, పెట్రోల్ వంటి వాటి కోసం నెలకు రూ. 6,000 వినియోగిస్తున్నారు. కేవలం అవసరాలకే కాకుండా, ఆధునిక నగర జీవనంలో భాగంగా మారిన ఇతర ఖర్చులు కూడా వీరి బడ్జెట్లో గణనీయంగా ఉన్నాయి. బయట భోజనం, ఆన్లైన్ ఫుడ్ డెలివరీల కోసం రూ. 10,000, ఓటీటీ సబ్స్క్రిప్షన్ల కోసం రూ. 3,000 ఖర్చు చేస్తున్నారు. వీటితో పాటు షాపింగ్, ఇతర అనుకోని ఖర్చుల కోసం నెలకు మరో రూ. 15,000 పక్కన పెడుతున్నారు. విమాన ప్రయాణాలు లేదా సెలవుల ఖర్చులు కలపకుండానే నెలకు రూ. 1.3 లక్షలు అవ్వడం గమనార్హం.ఎంత సంపాదించినా నెల ఆఖరికి డబ్బులు మిగలడం లేదు అన్న వారి వ్యాఖ్య నగరవాసుల మానసిక స్థితిని తెలియజేస్తోంది. రూ. 70 లక్షల ప్యాకేజీ.. కానీ సేవింగ్స్ సున్నా! వైరల్ అవుతున్న శాలరీ బ్రేకప్! ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు విభిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు వినియోగదారులు ఈ ఖర్చులను తీవ్రంగా విమర్శించారు. అధిక అద్దె ఉన్న ప్రాంతాన్ని ఎంచుకోవడం వారి వ్యక్తిగత నిర్ణయమని, దీవఅస్త్రుశ్రీబతీబ లో తక్కువ ఖర్చుతో కూడా జీవించవచ్చని వారు వాదించారు. ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబాలు కూడా ఇంతకంటే తక్కువ ఖర్చుతో నెట్టుకొస్తున్నారని మరికొందరు గుర్తుచేశారు. అయితే, మరో వర్గం ప్రజలు ఈ జంటను సమర్థించారు. సౌకర్యవంతమైన, నాణ్యమైన జీవనశైలిని కోరుకునే వారికి బెంగళూరు వంటి నగరాల్లో ఇవి కనీస ఖర్చులేనని వారు అభిప్రాయపడ్డారు. ఇతర నగరాలతో పోలిస్తే ఇక్కడ నివాస వ్యయం చాలా ఎక్కువగా ఉందని, ఒక మంచి నగరంలో లభించే అవకాశాలకు మనం చెల్లించాల్సిన మూల్యం ఇదేనని పలువురు వ్యాఖ్యానించారు. ఈ చర్చ ద్వారా నగరాల్లో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మారుతున్న ప్రజల జీవన ప్రమాణాల మధ్య ఉన్న వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. డిస్క్లైమర్: ఈ వెబ్సైట్లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కావని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్సైట్లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

8వ పే కమిషన్ కీలక అప్డేట్

ఎనిమిదవ వేతన సంఘం తెలుగు రాష్ట్రాల పర్యటన వివరాలు ఇవిగో.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల భవిష్యత్తును నిర్ణయించే 8వ కేంద్ర వేతన సంఘం కార్యకలాపాలు ఇప్పుడు కీలక దశకు చేరుకున్నాయి. ప్రతి పదేళ్లకు ఒకసారి ఏర్పాటు చేసే ఈ కమిషన్, సుమారు 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్ల జీతభత్యాలు, పెన్షన్ విధానాలను పునర్నిర్మించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ఈ కమిషన్ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ.. సంబంధిత భాగస్వాముల నుండి అభిప్రాయాలను సేకరించే పనిలో నిమగ్నమై ఉంది. ఉద్యోగ సంఘాలు, వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు కమిషన్ ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసింది. దీని ప్రకారం 2026 మే 13, 14 తేదీలలో ఢిల్లీలో రైల్వే, రక్షణ మంత్రిత్వ శాఖల పరిధిలోని యూనియన్లతో కీలక సమావేశాలు జరగనున్నాయి. ఆ తర్వాత కమిషన్ తన పర్యటనను దక్షిణాదికి విస్తరిస్తూ, మే 18-19 తేదీలలో హైదరాబాద్లో తెలంగాణకు చెందిన వాటాదారులతో చర్చలు జరుపుతుంది. జూన్ నెలలో పర్యటనలు ఉత్తరాదికి మారుతాయి; జూన్ 1 నుండి 4 వరకు జమ్మూ & కాశ్మీర్లోని శ్రీనగర్లో, ఆపై జూన్ 8న లడఖ్లో సమావేశాలు నిర్వహిస్తారు. వీటితో పాటు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో కూడా ప్రత్యేక సమావేశం ఉంటుందని కమిషన్ వెల్లడించింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2025లో ప్రకటించబడిన ఈ కమిషన్కు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాష్ దేశాయ్ అధ్యక్షత వహిస్తున్నారు. ఇందులో సభ్యులుగా ప్రొఫెసర్ పులక్ ఘోష్, సభ్య కార్యదర్శిగా పంకజ్ జైన్ వ్యవహరిస్తున్నారు. ఈ ప్యానెల్ కేవలం వేతనాలను పెంచడమే కాకుండా, కరువు భత్యం ఫిట్మెంట్ ఫ్యాక్టర్, ఇతర అలవెన్సుల విషయంలో శాస్త్రీయమైన విశ్లేషణ చేస్తుంది. కార్మిక సంఘాలు, పెన్షన్ సంస్థలు, వివిధ విభాగాల నుండి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త వేతన నిర్మాణాన్ని సిఫార్సు చేస్తుంది. 8వ వేతన సంఘం: మీ జీతం ఎంత పెరగబోతోంది? కేంద్రం కీలక నిర్ణయం! భాగస్వాములందరికీ తమ వినతులను సమర్పించేందుకు తగిన సమయం కల్పించాలనే ఉద్దేశంతో, కమిషన్ మెమోరాండం సమర్పణ గడువును 2026 మే 31 వరకు పొడిగించింది. నిజానికి ఈ ప్రక్రియ మార్చిలో ప్రారంభమై ఏప్రిల్తో ముగియాల్సి ఉన్నప్పటికీ, అభ్యర్థనల మేరకు ఒక నెల అదనపు సమయం ఇచ్చారు. ఈ సంప్రదింపుల ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత, కమిషన్ ప్రారంభమైన 18 నెలలకు, అంటే 2025 నవంబర్ 3 నాటికి తుది నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నివేదికలో సూచించే అంశాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవన ప్రమాణాలను మరియు ఆర్థిక భవిష్యత్తును గణనీయంగా ప్రభావితం చేస్తాయి.

స్టాక్ మార్కెట్లో సంచలనం

వ్యాల్యూ 360 ఐపీఓ లిస్టింగ్.. ఇన్వెస్టర్లకు లాభాల పంట పండుతుందా వ్యాల్యూ 360 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ నేడు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లో అడుగుపెట్టింది. ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈ ప్లాట్ఫామ్పై ఈ కంపెనీ షేర్లు లిస్ట్ అయ్యాయి. భారతీయ పబ్లిక్ రిలేషన్స్రంగంలో ఇదొక కీలక మైలురాయిగా నిలవనుంది. మార్కెట్ ప్రారంభంలో ఓపెనింగ్ ప్రైస్ ఎలా ఉంటుందోనని ఇన్వెస్టర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సర్వీస్ సెక్టార్లో కనిపిస్తున్న భారీ వృద్ధికి ఈ పరిణామం ఒక నిదర్శనం. ఈ ఐపీఓకు రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. మూడు రోజుల బిడ్డింగ్ సమయంలో షేర్లకు భారీ డిమాండ్ ఏర్పడిందని మార్కెట్ నిపుణులు గమనించారు. సర్వీస్ ఆధారిత స్టార్టప్ మోడల్స్పై ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకాన్ని ఈ ఆసక్తి చాటిచెబుతోంది. గత రెండు దశాబ్దాలుగా ఈ సంస్థ సాధించిన వృద్ధికి ఈ లిస్టింగ్ ధర అద్దం పడుతోంది. దేశీయ కన్సల్టింగ్ ఏజెన్సీల విజయగాథలో ఇదొక అరుదైన ఘట్టం. వ్యాల్యూ 360 కమ్యూనికేషన్స్ ఐపీఓ లిస్టింగ్ విశేషాలు ఇన్వెస్టర్లను ఆకర్షించేలా కంపెనీ తన ప్రైస్ బ్యాండ్ను నిర్ణయించింది. ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను గ్లోబల్ ఎక్స్పాన్షన్, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం ఉపయోగించనున్నారు.



'రాకా' నుంచి గ్లింప్స్ రాబోతుందా?

అల్లు అర్జున్ మూడు షేడ్స్‌లో కనిపించబోతున్నాడా..!

'పుష్ప' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా 'రాకా' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. సినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా 'రాకా'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ ఈ చిత్రంలో మూడు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నారట. కథలో కీలకమైన మూడు దశలను ప్రతిబింబించేలా ఆయన పాత్ర డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అట్లీ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. ఇక సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన కంపోజ్ చేస్తున్న ట్యూన్స్‌పై చిత్ర యూనిట్ చాలా నమ్మకంగా ఉందని తెలుస్తోంది. సినిమా కథ, విజువల్స్‌తో పాటు సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లింప్స్ విడుదలపై వస్తున్న వార్తలపై అధికారికంగా క్లారిటీ లేదు. గ్లింప్స్ విడుదలైతే 'రాకా' ప్రపంచం ఎలా ఉండబోతోందో, అట్లీ-బన్నీ కాంబినేషన్ ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని అందించబోతోందో తొలి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వెండితెరపై ఎంట్రీ ఇస్తున్న 'రాను బొంబాయికి రాను' భామ!

'రాను బొంబాయికి రాను' ఫోక్ సాంగ్ ఎంత సూపర్ హిట్ అయిందో అందరికి తెలిసిందే. లిరిక్స్ కంటే ఎక్కువగా రామ్ రాథోడ్, లిఖిత వేసిన స్టెప్పులు బాగా వైరల్ అయ్యాయి. అంతేకాదు ఈ ఒక్క పాటతో లిఖిత..తెలుగు ఆడియన్స్‌కి బాగా దగ్గరైంది. ఈ పాట తర్వాత వరుస అవకాశాలతో దూసుకెళ్తుంది. అయితే ఇన్నాళ్లు ప్రైవేట్ ఆల్బమ్స్‌తో అలరించిన లిఖిత..ఇక ఇప్పుడు హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతుంది. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఆమెను టాలీవుడ్‌కి పరిచయం చేయబోతున్నాడు. సామ్రాట్, డీమోన్ పవన్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'సాఎ3' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ రోజు పూజా కార్యక్రమాలతో 'సాఎ3' సినిమా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అశోక్ కుమార్ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ – డైరెక్టర్ గారు ఈ స్క్రిప్ట్ చెబుతున్నప్పుడే మూవీ ఎలా ఉంటుంది అనేది క్లియర్ గా తెలిసింది. నేను ఫోక్ సాంగ్స్ నుంచి చిన్న గ్యాప్ తీసుకున్నాను. హీరోయిన్ గా మంచి రోల్స్ చేయాలనే ఫోక్ సాంగ్స్ కు గ్యాప్ ఇచ్చాను. అయినా మంచి ఆల్బమ్ వస్తే తప్పకుండా చేస్తాను. నేను ఒక బెస్ట్ స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్న టైమ్ లో ఈ మూవీ ఆఫర్ వచ్చింది. సామ్రాట్, పవన్ లాంటి కోస్టార్స్ దొరకడం హ్యాపీగా ఉంది. ఎలాంటి స్క్రిప్ట్ పేపర్ లేకుండా మేమంతా కథను ఓన్ చేసుకుని నటించాం. అదంతా మా డైరెక్టర్ వల్లే సాధ్యమైంది' అన్నారు. దర్శకుడు కృష్ణమాయ మాట్లాడుతూ... లిఖి, డీమోన్ పవన్ కొత్త వాళ్లు ఎలా నటిస్తారో అనుకున్నాను గానీ పర్ ఫార్మెన్స్ ఇరగదీశారు. మా టెక్నీషియన్స్ అందరూ అద్భుతమైన ఔట్ పుట్ ఇచ్చారు. 'సాఎ3' సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం' అన్నారు. హీరో డీమోన్ పవన్ మాట్లాడుతూ – బిగ్ బాస్ తర్వాత నేను ఎలాంటి మూవీ చేయాలని ఆలోచిస్తున్న టైమ్ లో డైరెక్టర్ కృష్ణ మాయ ఈ స్క్రిప్ట్ చెప్పారు. చాలా మంచి స్క్రిప్ట్ ఇది. ఆయన స్క్రిప్ట్ చెబుతుంటే ఇంకా వినాలని అనిపించింది. అంత ఎక్స్ ప్రెసివ్ గా స్టోరీ చెప్పారు. ఇలాంటి దర్శకుడితో వర్క్ చేస్తే నటుడిగా నాకు మంచి పేరొస్తుందని నమ్మాను. మేమంతా ఈ సినిమా కోసం ఎలాంటి డైలాగ్స్ లేకుండా ఆన్ సెట్ ఇంప్రూవైజ్ చేసుకుంటూ నాచురల్ గా నటించాం. తక్కువ టైమ్ లో మేమంతా క్వాలిటీగా సినిమా చేశాం. అన్నారు.

శింబు టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమా?.. తెలుగు డెబ్యూపై మళ్లీ జోరందుకున్న చర్చ

కోలీవుడ్ స్టార్ హీరో శింబుకు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమాన వర్గం ఉంది. ఆయన నటించిన అనేక తమిళ చిత్రాలు తెలుగులో డబ్బింగ్ అయి మంచి విజయాలు సాధించడంతో టాలీవుడ్‌లో కూడా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే ఇంతటి క్రేజ్ ఉన్నప్పటికీ శింబు ఇప్పటివరకు నేరుగా తెలుగు సినిమాలో నటించలేదు. దీంతో ఆయన టాలీవుడ్ ఎంట్రీ గురించి తరచూ వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఈ అంశం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని నెలలుగా శింబు ఓ ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థతో సినిమా చేయబోతున్నారనే ప్రచారం సాగుతోంది. గతంలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో శింబు హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. మనసనమహా' షార్ట్ ఫిల్మ్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు దీపక్ రెడ్డి చెప్పిన కథ నిర్మాతలను ఆకట్టుకుందని, శింబు కూడా ఆ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆ తర్వాత ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.ఇప్పుడు తాజాగా మరో కొత్త కథతో శింబు ముందుకు వచ్చినట్లు సమాచారం. యువ దర్శకుడు కీర్తిశ్వరన్ చెప్పిన కథ ఆయనను బాగా ఆకట్టుకుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన 'డ్యూడ్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న కీర్తిశ్వరన్, కొత్త తరహా కథాంశంతో శింబును మెప్పించినట్లు తెలుస్తోంది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఇక శింబు కెరీర్ విషయానికి వస్తే, బాలనటుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన ఆయన 2002లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. ప్రేమకథలు, యాక్షన్ డ్రామాలు, మాస్ ఎంటర్‌టైనర్‌లతో తమిళ ప్రేక్షకులను అలరిస్తూ స్టార్ హీరోగా ఎదిగారు. ఒక దశలో తెలుగులో కూడా ఆయన సినిమాలకు మంచి మార్కెట్ ఏర్పడింది. అయితే వరుస పరాజయాలు, వ్యక్తిగత వివాదాల కారణంగా కొంతకాలం కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తిరిగి వరుస విజయాలతో బలంగా కమ్‌బ్యాక్ ఇచ్చిన శింబు, ప్రస్తుతం తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు మార్కెట్‌పై దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలువురు తమిళ హీరోలు నేరుగా తెలుగు సినిమాలు చేసి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో శింబు కూడా అదే బాటలో నడవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఏడేళ్ల ప్రేమకు పెళ్లి ముహూర్తం..

ప్రియాంక జైన్‌తో వివాహంపై క్లారిటీ ఇచ్చిన శివకుమార్

తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు ఎంతో పరిచయమైన జంటల్లో ప్రియాంక జైన్, శివకుమార్ ఒకరు. 'మౌనరాగం' సీరియల్ ద్వారా పరిచయమైన వీరిద్దరూ మొదట మంచి స్నేహితులుగా మారి, ఆ తర్వాత ఆ స్నేహం ప్రేమగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ప్రస్తుతం లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో కూడా కొనసాగుతోంది.వీరి ప్రేమ వ్యవహారం గురించి అభిమానులకు ఎప్పటి నుంచో తెలుసు. దీంతో సోషల్ మీడియాలోనూ, ఇంటర్వ్యూల్లోనూ వీరిద్దరికి తరచూ ఎదురయ్యే ప్రశ్న ఒక్కటే.. "పెళ్లి ఎప్పుడు?" అనే విషయం. తాజాగా ఈ ప్రశ్నకు శివకుమార్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు.ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తమ ప్రేమ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మాది ఏడేళ్ల ప్రేమ. మొదట ప్రియాంకే నాకు ప్రపోజ్ చేసింది. ఆమె ప్రపోజ్ చేసిన రెండు రోజుల తర్వాత నేను ఓకే చెప్పాను. అప్పటి నుంచి మా బంధం మరింత బలపడింది అని తెలిపారు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌పై కూడా ఆయన స్పందించారు. మేము కలిసి ఉండటానికి ముందే మా కుటుంబ సభ్యుల అనుమతి తీసుకున్నాం. రెండు కుటుంబాలు కూడా మా నిర్ణయాన్ని గౌరవించాయి. వారి అంగీకారంతోనే మేము లివ్-ఇన్‌లో ఉన్నాం అని చెప్పారు. పెళ్లి విషయానికి వస్తే, ప్రస్తుతం ఇద్దరూ కలిసి ఒక ఇంటిని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మా కలల ఇల్లు నిర్మాణంలో ఉంది. అది పూర్తయిన వెంటనే ఈ ఏడాదిలోనే పెళ్లి చేసుకుంటాం. పెళ్లి కోసం ఇప్పటికే కొన్ని ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నాం అని అన్నారు. తమ వివాహాన్ని ఉత్తరాఖండ్‌లోని ఓ పవిత్ర ఆలయంలో నిర్వహించాలని భావిస్తున్నట్లు శివకుమార్ తెలిపారు. యోగి నారాయణ్ ఆలయంలో పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాం. పురాణాల ప్రకారం శివపార్వతుల వివాహం కూడా అక్కడే జరిగినట్లు చెబుతారు. అందుకే ఆ ప్రదేశం మాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది అని వివరించారు.ఆలయంలో సాంప్రదాయబద్ధంగా వివాహం జరిగిన అనంతరం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే భవిష్యత్తులో నిర్మిస్తున్న ఇంట్లో రెండు కుటుంబాలు కలిసి ఉండేలా ప్రణాళికలు వేసుకున్నామని వెల్లడించారు. నేను నా కుటుంబంతో, ప్రియాంక తన కుటుంబంతో కాకుండా అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండాలని కోరుకుంటున్నాం. కుటుంబ బంధాలకు మేము ఎంతో విలువ ఇస్తాం అని శివకుమార్ తెలిపారు.

PRINTER,PUBLISHER AND OWNED BY M. A. NAVEEN KUMAR AND PRINTED AT M /S VANAMALI PUBLICATIONS , # 2-5-B , Revenue Ward No :2, Rudrampeta, Anantapur Rural & Mandal, Anantapur -515004, Ananthapuramu District, Andhra Pradesh PUBLISHED AT D. No 1-493 B, INDIRA GANDHI NAGAR , Anantapur -515001, Ananthapuramu District, Andhra Pradesh Editor : M. A .NAVEEN KUMAR Email : kumarmanaveen @gmail.com cell: 8919517176